# సాయి భక్తులు నాడూ – నేడూ!

వేరొక మహాత్మునికిగానీ దైవానికిగానీ భక్తులమవడానికీ, సాయి భక్తులమవడానికీ ఎంతో తేడావుంది. సాయి నిర్మానుష్యమైన కొండ గుహలలో గాకుండా గ్రామంలో జనం మధ్యన వున్నారు; భిక్షతో జీవించారు; దక్షిణలు తీసుకొన్నారు; ఏ నియమనిష్ఠలూ విధించలేదు. ఎందరెందరిచేతనో ఎంతో ఘనంగా పూజింపబడ్డారు. ఒక మాటలో చెప్పాలంటే అటు ఫకీరు జీవితంలోను, యిటు మహరాజు జీవితంలోనూ గల సౌలభ్యాలను రెండింటినీ ఆయన అనుభవించారు! అందుకే సాయికి భక్తులవుతున్నవారు గూడ యీ రోజుల్లో అలానే చేస్తున్నారు. మిగిలిన సాధువులు–ఉదాహరణకు రమణ మహర్షిని తీసుకోండి–పాదాలు తాకి నమస్కరించనివ్వలేదు; దక్షిణలు తీసుకోలేదు; మాల వేయనివ్వలేదు; హారతివ్వనివ్వలేదు. అందుకనే త్వరపడి భక్తులు ఆయనను అనుకరించరు. సాయి విషయంలో అలాగాదు. ఈ రోజులలో దాదాపు అందరూ ఆయనను అనుకరించేవారే! – అనుసరించేవారు మాత్రం లేరు. అసలు సాయి సాంప్రదాయమంతా అనుసరించడంలోను, అనుకరించక పోవడంలోనూ వున్నది. కొంచెం వివరిద్దాము.

రోజు రోజుకీ సాయిభక్తులైన 'సాధువులు' భక్తుల యిండ్లమీదకి దాడి చేయడం పెరుగుతున్నది. వీరిలో కొట్టవచ్చినట్లు కన్పించే విషయం–సాయివలె కఫ్నీ, తలకు గుడ్డ, మెడలో సంచి! దేశంలో సాయి ప్రచారమెక్కువైన కొద్దీ ఏదో ఒక సాధువు రూపంలో ఆయన వస్తారన్నది భక్తులను దోచుకొనే పద్ధతైంది. సాయిబాబా పటాలలోలాగానే వీరుగూడ చేయెత్తి అభయమిస్తారు. చరిత్రలో చదివి తమకు గూడ అటువంటి అనుభవాలు రావాలని వెతుగులాడే భక్తులు ఆ రూపంలో సాయియే వచ్చారని భ్రమించడం వీరికెంతో ఉపయోగం–వీరు ఎక్కడో సాయిబాబా మందిరం కడుతున్నామనో, సాధువులకు అన్నదానం చేస్తున్నామనో, గోశాల నిర్వహిస్తున్నామనో చెప్పి చందాలు వసూలుచేస్తారు. భక్తులు భయంతోను, ఆశతోనూ సమర్పించే కాన్కలే యీ జాతివంచన పెరిగేలా చేస్తున్నది. లాభసాటి బేరంగదా? ఇటీవల ఒక ఉద్యోగి వద్దకు యిలాటి 'ఫకీరు' వచ్చి రూ. 300/–లు దక్షిణ అడిగి, మూడు గాజుపూసలిచ్చి, నెత్తిన చేయిపెట్టి వెళ్ళాడు జాగ్రత్త!

సాయి యిలా యిండ్లవెంట, ఊళ్ళవెంట తిరిగి డబ్బులు వసూలు చేయలేదు. ఆలయం, గోశాల అంటూ వసూళ్ళూ చేయలేదు. భక్తుల యిండ్లలో బస, భోజనమూ చేయలేదు.

పై జెప్పిన సాధువులలో కొందరు, "మేము శిరిడీ వెడుతున్నాము. అక్కడ ధునికి పూజ చేయమని ఫలాని భక్తులు రూ. 116/–లు యిచ్చారు" అంటున్నారు. అదేమిటోనన్న ఆశతో వేలంవెర్రిగా భక్తులంతా రూ. 116/–లు వీరికి సమర్పించడం ప్రారంభమైంది. ఈ సాధువులు తమ సంగతి పొక్కనారంభించిన ప్రాంతంలో యిక తిరుగరు. ధునిపూజ శిరిడీ వెళ్ళినపుడు మనం స్వయంగా చేయవచ్చు, చేయడం శ్రేయస్కరం. ఈ కపట సాధువులు, "మేము శిరిడీలో 10 సం॥లు వున్నాము, 20 సం॥లు వున్నాము" అని చెబుతున్నారు. విచారిస్తే అది నిజంగాదని తెలుస్తున్నది, కాని యీలోగా జరిగిపోవలసినది జరిగిపోతుంది.

ఒక్కటే గుర్తుంచుకోండి. ఇందులో చెప్పిన జాగ్రత్తలు చదివి, నిజంగా సాయి మనకు సాక్షాత్కరిస్తే మనం వారికి దక్షిణ యిచ్చే అవకాశం కోల్పోతామేమోనని భయం అక్కరలేదు. ఆయనే నిజంగా తీసుకోదలిస్తే యిలాంటి చౌకబారు కారణాల అవసరం ఆయనకు లేదు. పైన చెప్పిన అంశాలకు తోడు ఆ సాధువులు విభూతి సృష్టించడం వంటి పిచ్చి వేషాలు వేస్తే వెంటనే బయటకు నడవమనండి. పెద్ద మొత్తాలలో అంటే రూ. 1/–, 2/–లు మించి, దక్షిణలు అడిగితే పోలీసులకు పట్టించండి. భయంలేదు. సాయి సాంప్రదాయం శుద్ధంగా వుండేందుకు దోహదం చేసిన పుణ్యమే మనకుంటుంది!

–"సాయిబాబా"

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 27 నవంబరు 2009 సంచిక: 7

OFFICIAL ORGAN OF MASTER UNIVERSAL SAI TRUST

చీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: శ్రీ జె.శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.సి





**చందా వివరములు**

| | | |
|---|---|---|
| విడిప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |
| జీవిత చందా | : | రూ. 1,116-00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)

(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | | |
|---|---|---|
| రాజపోషకులు | : | రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : | రూ. 5,000-00 |


**చిరునామా**

**శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్, మంగమూరు డొంక, ఒంగోలు-2.**

**ఫోన్ నెం: 08592 - 233271**

website: www.saibharadwaja.org


www.saimasterforums.org

# విషయసూచిక:


| | | |
|---|---|---|
| 1. | సాయి భక్తులు నాడూ - నేడూ! | 1 |
| 2. | ధర్మ ప్రచారకులారా! యోచించండి!! | 3 |
| 3. | అస్తి - నాస్తి | 6 |
| 4. | వార్తాలాపము - సీరియల్ | 8 |
| 5. | శ్రీ భరద్వాజ లేఖామృతము | 12 |
| 6. | శ్రీ దత్తలీలామృతము | 15 |
| 7. | కోతిబుద్ధి - సమాజశ్రేయస్సు | 19 |
| 8. | శుద్ధతత్వజ్ఞానానికి ప్రతిరూపమే మాస్టర్‌గారు | 21 |
| 9. | ఇది కేవలం శ్రీ మాస్టరుగారి కృప | 22 |
| 10. | ఈ గ్రంథం నాస్తిల వాదానికో సవాల్! | 25 |
| 11. | శ్రీ సాయి సచ్చరిత్ర | 26 |
| 12. | నేను ఎక్కడికీ పోలేదు! ఇక్కడే ఉన్నాను! | 28 |
| 13. | అగరొత్తులు అర్పించడంలో అంతరార్ధం | 29 |
| 14. | నీటమునిగిన రాఘవేంద్రులు | 30 |



# ధన్యవాదములు

ఈ సంచిక ముద్రణకు ఆర్ధిక సహకారము అందించిన వారు:

1. శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్
2. www.saibharadwaja.org
3. Sai Master Forums Online సత్సంగ సభ్యులు

**వీరిని శ్రీ సాయి మాస్టర్ సదా అనుగ్రహించుగాక!**



సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.
శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్‌కు ఎటువంటి బాధ్యతా లేదు.

# ధర్మ ప్రచారకులారా ! యోచించండి ! !

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీ సాయిబాబాను ఆరాధించుకొనే విధానంలో ముఖ్యమైన అంశాలు రెండు:

1. శ్రీసాయిబాబా జీవిత చరిత్ర పారాయణ
2. శ్రీ గురుచరిత్ర పారాయణ

ఈ విషయం మహారాష్ట్రదేశానికి చెందిన సాధకులకు తెలుసుగాని యితర ప్రాంతాలలోని ఎక్కువ మందికి తెలియదు. ఈ విషయం యింకొంచెం వివరించాలి.

ముముక్షువులైన సాధకులేగాక భక్తులందరూ ఆలోచించవలసిన విషయ మొకటున్నది. యోగి వేమన, శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామి తప్ప ఆంధ్ర దేశంలో మహనీయులుగా భగవంతుడవతరించిన సందర్భమే కనిపించదు. కారణం?

అటువంటిది మహారాష్ట్ర దేశంలో 12వ శతాబ్దంనుండి నిరంతర ధారగా ఎందరు మహనీయులవతరించారో! ఒక వంక ఆంధ్ర దేశంలో అవతరించిన శ్రీపాదవల్లభులు కర్ణాటకలోని రాయచూర్ వద్ద కురువపురానికి వెళ్ళిపోయారు. త్రైలింగస్వామి కాశి వెళ్ళిపోయారు. శ్రీ నృసింహ సరస్వతిస్వామి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ అక్కల్‌కోట స్వామి, వారి సమకాలికులైన శిరిడీ సాయి బాబా, తాజుద్దీన్ బాబా, ధునీవాలా దాదా, శ్రీ వాసుదేవానంద సరస్వతి రూపాలలో శ్రీ దత్తాత్రేయుడు అవతరించారు. వీరిలో ఒక్కొక్కరి వలన మహారాష్ట్రలో ఎందరు మహాత్ములుగా రూపొందారో! ఒక్క అక్కల్‌కోట స్వామి వలన పూర్ణులైన వారే సుమారు 20 మంది దాకా వున్నారు. ఇది గాక ఆ దేశంలో శ్రీ జ్ఞానేశ్వర్, నామదేవు తుకారాము మొదలయిన భక్తులెందరవతరించారో శ్రీ పాండురంగ భక్తి విజయంలో చూస్తే తెలుస్తుంది. ఇదిగాక మహానుభావ సాంప్రదాయము, నవనాథ సాంప్రదాయాలలో యింకెందరో అవతరించారు. అంతటి అదృష్టం మహారాష్ట్రానికి ఎలా పట్టిందో ఆలోచిస్తే మనం గూడా వారి అడుగు జాడలలో నడచి అట్టి అదృష్టానికి పాత్రులం గావచ్చు మనకే గాక భావితరాలకు గూడా ఎంతో మేలు చేసుకోవచ్చు.

ఇంతటికి మూలం ఒక్క మహారాష్ట్రంలోనే లేదు. పురాణ కాలం నుండి నేటివరకూ పూర్ణుడైన గురువునాశ్రయించడమే ముఖ్య సాధనమన్న ఆధ్యాత్మసూత్రం సజీవంగా కొనసాగుతుంది. సద్గురువు యొక్క దర్శనము, అనుగ్రహము కోసం స్కందపురాణాంలోని 'శ్రీ గురుగీత' శ్రద్ధగా పారాయణ చేయబడుతోంది. అందువలన భగవంతుడు గురువుగా అవతరించిన శ్రీ దత్తావతార పరంపరను బాగా వినియోగిచుకోగల సంస్కారమచటి ప్రజలలో వుంది. అటుతర్వాత 16వ శతాబ్దం నుండి శ్రీ గురుచరిత్ర పారాయణ ఎంతో విస్తారంగా చేయబడుతోంది. అంతటితో ఆ ప్రజలకు దత్తానుగ్రహం యింకా విరివిగా 1850 నుండి లభించడమేగాక మరింత పటిష్టమైంది.

పూర్ణ దత్తావతారమైన శ్రీ సాయి ఆ రాష్ట్రంలో అవతరించడానికి ప్రధాన కారణమిదే. సం॥ 1923 ప్రాంతంలో సన్నిహిత సాయి భక్తులందరూ దక్షిణ భిక్షా సంస్థగా ఏర్పడి ఆసక్తికరమైన విషయాలెన్నిటినో చిన్న పుస్తకాలుగా ప్రచురించారు. వాటిలో శ్రీ సాయి ఎంతో కాలంగా ఆ ప్రాంతం తమదిగాను తమ పూర్వీకులది గాను వున్నదని , అందువల్లనే మరల తామక్కడ అవతరించామని చెప్పారు. సద్గురు సేవా ప్రధానమైన దత్తసాంప్రదాయ ప్రవర్తకులమని తెల్పడానికే ఆయన తాము గూడ ఒక పూర్ణ గురువుని సేవించామని చెప్పారు. గురుసేవ గురించి వారు చెప్పినదంతా శ్రీ గురుగీత, శ్రీ గురుచరిత్రలసారమే; ఉపనిషత్తుల సారమే. కాకుంటే ఆయనా విషయమెంతో టూకీగా చెప్పారు. వాటికి వివరణ ఆయా గ్రంథాలలో లభిస్తుంది. శ్రీ సాయి హేమాద్పంతును ప్రేరేపించి అనుమతిచ్చి ఆశీర్వదించి వ్రాయించిన శ్రీ సాయి సచ్చరిత్ర రచన గూడ ప్రతి అక్షరమూ శ్రీ గురుచరిత్ర రచనా విధానాన్నే అనుసరించింది. శ్రీ గురు చరిత్రలో నామధారకుడు మొదట శ్రీగురుని మహిమవిని ఆయన దర్శనానికి బయలుదేరతాడు. అలానే హేమాద్పంతు సాయి మహిమ విని సాయి దర్శనానికి వెళ్ళాడు. శ్రీ గురు శిష్యుడైన సిద్ధుడు నామధారకునికి శ్రీ గురులీలలు వివరించి చెప్పినట్లు, సాయి భక్తులు హేమాద్పంతు రచనకు తమ అనుభవాలందించారు. ఈ రెండు గ్రంథాలు సప్తాహ పారాయణ క్రమం గలవే. ఈ రెండు గణపతి, సరస్వతీ దేవి మొదలయిన వారి స్తుతులతో ఆరంభమౌతాయి. అటు తర్వాత నుండి సచ్చరిత్రలో హేమాద్పంత్ సిద్ధుని పాత్ర వహిస్తే, పాఠకులు నామధారకులై శ్రవణం చేస్తారు. శ్రీ గురుని లీలలు పూర్తిగా వివరించడం తన వల్లగాదని సిద్ధుడు పదే పదే చెప్పినట్లే హేమాద్పంతూ చెబుతాడు. ఇద్దరూ గూడ ఆయా సద్గురులీలా శ్రవణం, చింతనముల

ఫలితాన్నెంతగానో ప్రశంసిస్తారు. మరాఠీ సచ్చరిత్ర అధ్యాయ విభజన గూడా శ్రీ గురు చరిత్రనే అనుసరిస్తున్నది. భేదమల్లా ఒక్కటే ! సిద్ధుడు శ్రీగురుని సేవ వలన పూర్ణుడై అవధూతగా లోకసంచారం చేస్తున్నాడు. హేమాద్పంతు సాధకుడిగా మరింత తరచుగా తన అపరిపకత్వతను కూడ శ్రోతలకు నివేదించుకుంటూ, సంసారయాత్ర చేసుకుంటున్నాడు.

అంతేగాదు, శ్రీ సాయి సేవ హేమాద్పంతుకు లభింటానికి కారణం అతడు 40 సంవత్సరాలుగా నిత్యమూ చేస్తూవున్న శ్రీగురు చరిత్ర పారాయణ ఫలితమే! మరెందరో సాయి భక్తులకు వారి సేవ లభించడానికి అదే కారణం. అసలు శ్రీ గురు చరిత్ర యొక్క ఉత్తమ ప్రయోజనం- ఒక వంక పారాయణ చేస్తున్న భక్తునికి సద్గురువును సేవించగల హృదయ సంస్కారమిచ్చి , అది కల్గగానే అంతటి ఉత్తముడైన గురువును గురించి తెల్పడము, వారి కృపకు పాత్రుని చేయడమూ, అంతటి వారి కృపకు పాత్రుని చేయడమూ. హేమాద్పంతు చేసిన 40 సంవత్సరాల పారాయణ వల్లనే ప్రపంచంలోని మహాత్ముల కూటమికంతటికి సామ్రాట్టు, కోహినూరు అయిన సాయి సేవ లభించింది. ఆ విషయం అతడు గుర్తించినందువల్లనే సచ్చరిత్ర 18వ అధ్యాయంలో వర్ణించిన లీల జరిగింది. శ్యామా నోట సాయి రాధాబాయికి చెప్పిన సమాధానం చెప్పించారు బాబా. వారిద్దరూ మశీదుకు చేరాక ,ఆ ఒక్కలీల గుర్తుంచుకుంటే చాలునని, అతని జన్మ కలకండలా మధురం కాగలదని శ్రీ సాయి చెప్పారు. ( సచ్చరిత్ర అధ్యాయం 18) సాయి అంత వుత్తమంగా పరిగణించిన ఆ లీలగూడ శ్రీ గురుగీత, శ్రీగురు చరిత్రలసారమే ! ముముక్షువు సమిధలు చేతధరించి బ్రహ్మ నిష్ఠుడు, శృతులెరిగిన వాడునగు గురువును చక్కగా ఆశ్రయించాలని చెప్పిన ఉపనిషత్ సారమే. చక్కగా ఆశ్రయించడమెలాగో శ్రీ గురుగీత, శ్రీ గురుచరిత్రలలో వివరం లభిస్తుంది. శ్రీ గురు చరిత్ర ఉపనిషత్తులు గురుసాంప్రదాయమంతటినీ చక్కగా క్రోడీకరించి చెప్పింది. అందువలన సాయినెలా సేవించాలో తెలియాలన్నా ఆయన యొక్క పూర్ణానుగ్రహానికి పాత్రుల మవ్వాలన్నా శ్రీ గురు చరిత్ర పారాయణ నిజమైన సాయి భక్తులకు ఎంతో ముఖ్యం. ముముక్షువుగా అధ్యాత్మ మార్గంలో అడుగు పెట్టి మధ్యలో ప్రక్కదారి పట్టిన కుశాభావు చేత అందుకే ఆ గ్రంథం 108 సార్లు పారాయణ చేయించారు సాయి. సాయి పఠించమని చెప్పిన దాసబోధ, జ్ఞానేశ్వరి, ఏకనాధ భాగవతము గూడ గురుభక్తుని, సేవను ఉత్తమంగా చెప్పేవేనన్నది గమనార్హం.

శ్రీ గురు చరిత్రలోలాగ సాయి సాంప్రదాయంలో గూడ సద్గురు లీలావర్ణనమే ప్రధానమని పొడుగునా నిరూపణవుతున్నది. హేమాద్పంతు వలెనే మరింత విస్తారంగా శ్రీ బి.వి. నరసింహస్వామిచేత దక్షిణదేశంలోను, గుజరాత్‌లో ప్రచారం చేసిన శ్రీ ఆర్. ఎస్. చిట్నీస్ చేత, స్వామి కేశవయ్యజీ చేత యిలా యింకెందరి చేతనో తమ చరిత్రను మరింత విస్తారంగా కీర్తింపచేస్తున్నారు సాయి. భారత, భాగవతాలు మొదట స్వల్పసంఖ్య గల శ్లోకాలతో ఆరంభమై శుకుడు, సూతుడు మొదలయిన వారి వలన మరింత విస్తరిస్తూ వస్తుంది. ఈ సత్సాంప్రదాయమెరగని అల్పజ్ఞులు కొందరు శ్రీ సాయి ప్రత్యక్ష ఆశీస్సులతో హేమాద్పంతు వ్రాసిన సచ్చరిత్ర ఒక్కటే పారాయణకు యోగ్యమని, మిగిలినవినిగావనీ చెబుతున్నారు. లేక పై ప్రముఖ సాయి ప్రచారకులలో తాము అభిమానించిన వారి రచన ఒక్కటే ప్రమాణికమని చెప్పి సాయి సాంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు. వివిధ సాంప్రదాయాలకుచెందిన వారినే సమైక్యంగమ్మని సాయి ఆదేశమైతే , వీరు ఒక్క సాయి సాంప్రదాయాన్నే యిన్ని తెగలుగా చీల్చడం శోచనీయం. ఎందరిచేతనో ఆధ్యాత్మవేత్తలుగా పరిగణింపబడుతున్న వారుగూడ యిట్టి సంకుచిత తత్వానికి లోనవడం మరీ శోచనీయం. దీనంతటికి మూల కారణాలు రెండయి వుండవచ్చు; శ్రీ గురు చరిత్ర పారాయణ వలన శ్రీ దత్తాత్రేయుడే తగిన సద్గురువును చూపుతారన్నప్పుడుగాని లేక విపులమైన సాయి చరిత్ర భక్తులు చదివి తమకై తామే సాయి రక్షణ ఆశీస్సులు పొంద గల్గితే తమ ప్రాముఖ్యానికి ముప్పు వాటిల్లకలదన్న భయం గావచ్చు. లేక సాయి సాంప్రదాయంలో ఉపదేశమూ చిల్లర చమత్కారాలు, పూనకాలు, ప్రశ్న చెప్పడం, జ్యోతిష్యము మొదలయిన వాటికి తావులేదని వీరు గుర్తించక అలాంటివాటిలో నల్గురి యెదుట చిక్కుకొని యుండి, యీనాడదంతా సాయీ సాంప్రదాయవిరుద్ధమని భక్తులు తెలుసుకుంటే యిబ్బందని తలుస్తూండవచ్చు. వీరు చరిత్ర పారాయణకు ప్రాధాన్యమివ్వకపోడానికి ఒక కారణం చెబుతున్నారు. హేమాద్పంత్ ప్రత్యక్ష సాయి సేవకులనుండి లీలలు సేకరించాడు గనుక అదొక్కటే విశ్వసనీయమట. కాని శ్రీ బి. వి. నరసింహస్వామి గూడ వారినుండే మరింత విపులంగా అనుభవాలను సేకరించి, భక్తుల అనుభవాలు రెండు సంపుటాలుగా ప్రచురించారు. నేటి ప్రచారకులు కొందరు చెబుతున్నట్లు వీటిలో కల్పితాలకు తావుంటే హేమాద్పంత్‌కు తమ అనుభవాలు చెప్పినది వారేగదా? అదిమాత్రమెలా విశ్వసనీయ మౌతుంది. తర్వాత వ్రాయబడిన కొన్ని గ్రంథాలలో కొన్ని పొరపాట్లు దొర్లినమాట

వాస్తవమే. కాని వాటిని శ్రద్ధగా చదివేవారికి తేలికగా తెలిసిపోతాయి. అటువంటి కల్పనలు సాయి సచ్చరిత్రకు, శ్రీ బి.వి. నరసింహస్వామి సంకలనం చేసిన భక్తుల అనుభవాలుకూ విరుద్ధంగా వుండేవి కల్పనలని తలచవచ్చు. ఉదాహరణకు శ్రీ సాయి బాబా పుట్టుపూర్వోత్తరాలు గూర్చిన విషయమేమీ తెలియదని హేమాద్పంతు మొదలయిన ప్రత్యక్ష భక్తులు చెప్పారు. అందుకు విరుద్ధంగా దాసగణు వ్రాసిన పత్రి–సేలూ కథ సరియైన ఆధారం లేదని దాసగణే తన అనుభవంలో వ్రాశాడు. బెంగుళూర్‌కి చెందిన బాలబ్రహ్మచారి బాబా జేరుసలేమ్ నగరంలో హిందూ దంపతులకు జన్మించారని వ్రాశారు. ఇవి రెండూ–సాయి తమకు గురువు శిరిడీలోనే లభించారనీ, 1854లో వేపచెట్టు క్రింద ప్రకటం కాక ముందు తాము 12 సంవత్సరాలు భూ గృహంలో కేవలం వేపాకు తిని తపస్సు చేశామనీ చెప్పిన దానికి విరుద్ధం. ఇటువంటి లోపాలను వివేకంతో ఏరిపారేసుకుంటూ, ఎంత విస్తారంగా వీలైతే అంతగా సాయిలీలలు తెల్సుకుని పారాయణ చేయడం ఉత్తమమని అతి విస్తారమైన రామాయణ,భారత, భాగవతాలు సూచిస్తున్నాయి.

నేడెంతో ప్రచారంలో వున్న క్రైస్తవ మతం గూడా ఏసు లీలల, బోధల సంపుటాలే కదా. నేడు నిర్దుష్టంగా సాయి సాంప్రదాయం వ్యాపించాలన్నా మన దేశానికి ఉత్తమమైన అనుగ్రహం లభించాలన్నా బౌద్ధ , క్రైస్తవ, యిస్లాం సాంప్రదాయాలనుండే గాక శ్రీ గురు చరిత్రనుండి గూడా తెలుసుకోవలసినది ఒక్కటే. దేశంలో ఎందరు సాయి ప్రచారకులున్నా వారందరూ శ్రీ గురుచరిత్ర , సాయిబాబా జీవిత చరిత్రలు కూలంకషంగా పరిశీలించి సాయి సాంప్రదాయానికి నిషిద్ధమైన పైన సూచించిన రీతులను విడవడమవసరం . శ్రీ గురుని అనుగ్రహానికి పాత్రుడైన సిద్ధుడుగాని, హేమాద్పంతుగాని గురుత్వం వహించక ఆయా సద్గురువుల లీలా శ్రవణము, నామ స్మరణాలు విధించారు. బుద్ధుని శిష్యులు బుద్ధుని బోధలే చెప్పారు. మన సనాతన ధర్మంలోగూడ ఒకే ఒక్క సద్ధర్మానికి ప్రాముఖ్యమిచ్చారుగాని ఏ ఒక్క ఋషికి ప్రాధాన్యమివ్వలేదు. ప్రాధాన్యమంతా భగవదవతరానికే. క్రీస్తునుండి దివ్య శక్తులు పొందిన 12 మంది శిష్యులుగూడ వ్యక్తిగత గురుత్వాలకోసం ప్రాకులాడక క్రీస్తు లీలలను, భోధలను మాత్రమే ప్రచారం చేయడంవల్లనే ఆ మతానికంత ప్రాముఖ్యం వచ్చింది. మహమ్మదుల వారి జీవిత ఆచరణ, ఖురాన్ లకు ప్రాముఖ్యమిచ్చారు యిస్లాం ప్రచారకులు, ఈ సుత్రాన్నే శ్రీ గురు చరిత్ర, సాయిబాబా జీవిత చరిత్రగూడా తెలుపుతున్నాయి. మనకు నిజంగా సాయి ముఖ్యమైతే ప్రజల శ్రేయస్సే ముఖ్యమైతే మనమూ యిలానే చేయాలి. సాయి పేరును వ్యక్తిగత ప్రాముఖ్యతలకు వినియోగించుకొనడం సాయి ధర్మానికే కల్గిన గ్లాని. మన చరిత్ర పొడుగునా మత ద్వేషము, అసహనము ఆయా మతాలకే గాక చరిత్ర పొడుగునా ఎంత కీడు చేసాయో చూడవచ్చు. నేటి యువతరం మత విముఖులవడానికివే కారణం. దానిని నివారించనవతరించిన సాయీ సాంప్రదాయంలో యిట్టి వైఖరులు తలెత్తడం కేవలం కలి ప్రభావమే. క్రైస్తవ మత పదజాలంలో చెప్పాలంటే, క్రైస్తవ ధర్మమనే గొర్రెతోలు మాటున దాగిన సైతాననే తోడేలు నటనే!

ఇకనైనా మనమందరం నానాటికీ విస్తరిస్తున్న సాయి చరిత్రను, శ్రీ గురు చరిత్రను పారాయణ చేసి, సాటివారి చేత చేయించి సాయి సాంప్రదాయము పటిష్టం చేసుకొందాం; సమైక్యతతో పని చేద్దాం. సిద్ధుడు, హేమాద్పంత్, బుద్ధుడు, క్రీస్తు మొదలయిన వారి అనుయాయులు అనుసరించిన మార్గాన్నే పయనిద్దాం.

సాయీ సాంప్రదాయానికి, గురు చరిత్రకూ గల సామ్యమింకొకటివున్నది. నామధారకునికి సిద్ధుని ప్రత్యక్ష దర్శనం కల్గకముందే వారి స్వప్నదర్శనమైంది. సిద్ధుడు పూర్ణత చెందిన గురువు కూడా, అలానే సాయిని ప్రత్యక్షంగా దర్శించక ముందు ఎందరో భక్తులకు సాయి గూడా అలానే స్వప్న దర్శనమిచ్చారు. ఇక శ్రీ గురు లీలలకూ సాయి లీలలకూ పోలికలెన్నో . సాయి లీలలకు బోధలకూ వివరణ శ్రీ గురు చరిత్ర. శ్రీ గురు చరిత్రకూ, శ్రీ గురుగీతకూ వివరణ సాయిబాబా చరిత్ర ఒకటి యిరుసు రెండవది చక్రం. రెండూ వుంటేనే మన బండి ముందుకు పోతుంది. ఈ రెండూ ఒకే దత్తాత్రేయుని చరిత్రలు, శ్రీ గురు చరిత్ర కాలం నుండి నేటికి దేశకాల పరిస్థితులలో వచ్చిన మార్పులకనుగుణంగా అందించబడిన సనాతన ధర్మమే, దత్తాత్రేయుని బోధయే సాయిబోధ. నేటి యుగానికి తగిన సద్ధర్మం. ఈ మహాసముద్రంలో మన వ్యక్తిత్వాలనే ఉప్పుబొమ్మలు కరిగి పోయి మహార్ణమగుగాక! సాయి సాంప్రదాయంలోని వ్యక్తిగత బేధాలకు, ఈర్ష్యాద్వేషాలకూ, కలుషితమైన ప్రలాపాలకు బదులు సాయి లీలాస్మరణే జరుగుగాక!

---

# అస్తి–నాస్తి

"నువ్వింతగా ఆస్తికత్వము గురించి చెబుతున్నావుగాని ఎందరో మేధావులు మహిమలనేవి లేనే లేవని నిరూపిస్తున్నారు కదా! ఇటీవల నిప్పు మీద నడిచి చూపించారు. అలానే కరచాలనంతో విభూతి సృష్టించడం కూడా గారడి విద్యేగాని మహిమ కాదు అంటున్నారు. నీవేమంటావ్ ?"

"అసలైన ఆస్తికత్వానికి, ఆధ్యాత్మికతకు ఇలాంటి అద్భుతాలతో ఎట్టి ప్రమేయము లేనే లేదు. ఉదాహరణకు హిందూ మతంలో ఆధ్యాత్మికతకు ప్రమాణ గ్రంథాలుగా చెప్పబడిన ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలో వాటి ప్రస్తావనే లేదు. ఇలాంటి శక్తుల వలన ఆధ్యాత్మికతను నిరూపించవచ్చని చెప్పబడలేదు. ఆధ్యాత్మికత దు:ఖం నుండి , అజ్ఞానం నుండి విముక్తికి మార్గము మాత్రమేనని అవి చెబుతాయి. అలానే బుద్ధుడు కూడా మానవ జీవితంలోని దు:ఖం గూర్చి ఆలోచించి, దాని నుండి విముక్తికి మార్గాన్ని మాత్రమే బోధించాడు. ప్రాచీన చైనాకు చెందిన తావో మతం కూడా అలాగే చెబుతుంది. కనుక మహిమలను విమర్శించే వారంతా ఆధ్యాత్మికతకు సంబంధంలేని అంశాలనే విమర్శిస్తున్నారన్నమాట. ఆధ్యాత్మికత గూర్చి ప్రజలలో ప్రబలిన దురభిప్రాయాన్ని మాత్రమే వీరు విమర్శిస్తున్నారన్నమాట.

ఇది సరిగా తెలియాలంటే ఆధ్యాత్మికత ఏమిచెబుతుందో స్పష్టంగా తెలియాలి. సర్వగతము, నామ రూపరహితము అయిన ఒకానొక శక్తి మనకిపుడు గోచరించే వివిధ వస్తువులకు ఆధారమని క్షేత్రభౌతిక సిద్ధాంతము (field theory in physics) చెప్పినట్లే ఆధ్యాత్మికత కూడా చెబుతుంది. కాకుంటే ఆ శక్తి సచేతనమని, అదే దైవము , లేక పరమాత్మ అని ఆధ్యాత్మికత చెబుతుంది. ఆ మాట చెప్పదు భౌతిక శాస్త్రం. ఎంత యోచించినా ఆస్తికతకు నాస్తికతకు ఇదే భేదం. ఆ శక్తి సచేతనమని ఋజువైతే ఆధ్యాత్మికత నిరూపించబడ్డట్లే.

జడానికి సచేతనానికి ప్రధానమైన భేదమొక్కటే. సచేతనం తనలో తాను మార్పు తెచ్చుకోగలదు. ఉదాహరణకు మనిషి స్వేచ్ఛగా పని చేయగలడు. కాని జడము బాహ్య ప్రభావం లేక తనలో తాను ఎట్టి మార్పు చేసుకొనదు. ఇప్పుడు సృష్టి ఆదిలో ఒక్కటిగా వున్న శక్తి ఎలక్ట్రాన్ వంటి సూక్ష్మ కణములుగాను, వాటి సముదాయాలైన అణుపరమాణువులుగానూ. దేని ప్రభావం చేత మారినట్లు ? దాన్ని ప్రభావితం చేయడానికి వేరొక వస్తువేదీ ఏర్పడక ముందు దశ గురించి కదా మనము మాట్లాడుతున్నది? కనుక అది తనలో తానే అట్టి మార్పు చేసుకుని వుండాలి. అంటే అది సచేతనమై వుండాలి.

అంతే గాక, సచేతనము తనలో తాను చేసుకొనే మార్పులు క్రమబద్ధంగా కూడా వుంటాయి. ఈ సృష్టి అంతా క్రమబద్ధమేననటానికి ఆధారం నేడు రూపొందుతున్న విజ్ఞాన శాస్త్రాలే (science). వివిధ శాస్త్రాలు సృష్టియొక్క వివిధ అంశాలను పరిశీలించి, వాటికి మౌలికము, క్రమబద్ధమైన ప్రకృతి సూత్రాలను నిర్వచిస్తాయి. అంటే ప్రకృతిలోని ఆయా అంశాలు క్రమ బద్ధంగా ప్రవర్తిస్తాయన్నమాట. సృష్టికి మూలమైన శక్తి సచేతనమనడానికిదొక నిరూపణ.

అయితే ఆ శక్తి చేత చేయబడిన వాటిలో కొన్ని వస్తువులు జడంగాను, కొన్ని సచేతనం గాను ఎందుకు వుంటాయి అన్నది ప్రశ్న. సృష్టికి మూలమైన శక్తి విద్యుదయస్కాంత ధర్మాలుగల ధార్మిక శక్తి లేక క్షేత్రం అని నేటికి భౌతిక శాస్త్రం చెబుతుంది. కాని దాని యొక్క కూర్పులలో చెక్క వంటి పదార్థాలు విద్యుదయస్కాంత ధర్మాలను ప్రకటించకపోవటము వంటిదే, సచేతనమైన శక్తియొక్క రూపాలలో కొన్ని అచేతనంగా గోచరించడానికి కారణం.

ఆత్మ లేక దైవము అనబడే చైతన్యమే వాస్తవము కాదని నాస్తిక వాదానికి అర్థము. కాని అలా వాదించాలంటే, వాదించేవాడికి చైతన్యం వుండాలి. వాడి వాదమే నిజమైతే వాడు రాయివలే జడుడై, వాదించడానికి అతడంటూ ఒకడుండకూడదు. వాడితో వాదించే ఆస్తికుడు వుండకూడదు. అంతే కాదు, ధర్మము–అధర్మము , ప్రేమ–ద్వేషము, జ్ఞానము–అజ్ఞానము అనేవి చైతన్యానికే సాధ్యంగాని, జడానికి కాదు. అపుడు చైతన్యమే లేదని వాదించే వారు సమాజాన్ని మూఢనమ్మకాలనుండి కాపాడాలని తలచడమేమిటి? చైతన్యమే లేనప్పుడు చుట్టూ జగత్తనేది ఒకటుందని గుర్తించడం ఎలా సాధ్యం? చైతన్యమే వాస్తవం కాకుంటే దాని అనుభూతి మాత్రమే అయిన ఈ జగత్తు గాని , దాని గూర్చిన పరిశోధన గాని తత్ఫలితంగా రూపొందించబడిన అస్తి–నాస్తి

వాదాలు, గాని ఎలా వాస్తవం కాగలవు? కనుక ఏ రీతిగా చూచినా చైతన్యం లేదనడానికి వీలు లేదు. ఇది సృష్టికి మూలమైన తత్వానికి గల ధర్మమని (సత్ చిత్) ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ చెబుతున్నాయి. అన్నింటిలోను వున్న 'ఆ శక్తి– చేతనమే ' పరమాత్మ, లేక దైవమని, అది మనలోని 'నేను'గా అనుభవమైనప్పుడు జీవాత్మయనీ ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతాయి. వీటిని అసత్యమని నిరూపించగల వాదమే వుండజాలదు.

సృష్టికి మూలమైన శక్తి నశించేది కాదు కనుక, ఎన్ని రూపాలు ధరించినా దాని మూలతత్వంలో ఎట్టి మార్పు వుండదు, కనుక దానిని 'సత్'(real ) అన్నారు. అది సచేతనం కనుక 'చిత్'(awareness) అన్నారు. అది ఆనందమని కూడా అన్నారు. మానవుడు ఎన్ని సాధించినా ఇంకా ఏమో పొందాలన్న కోరిక అతనిని దహిస్తూనే వుంటుంది. అట్టి కొరత నుండి, దానిని ఆధారం చేసుకొని ఉత్పన్నమయే భయ, రాగ, అసూయ, ద్వేషాది కలతలు లేని స్థితినే ఆనందమన్నారు. సృష్టికాధారమైన శక్తి దృష్టిలో అన్యమన్నది లేదు గనుక, అది దేని పట్లా యిట్టి భావాలను పొందజాలదు. కనుక అది ఆనందం. అంతగా వికసించని మన చైతన్యము – మూలశక్తి యొక్క రూపము మాత్రమే అయిన దేహమే తానని భ్రమించి, తత్కారణంగా అన్యంగాతోచే జగత్తు పట్ల పై చెప్పిన కలతలను చెందడమే అజ్ఞానము – తానట్టి దేహమనే రూపము మాత్రమే కాదని, సృష్టికి మూలమైన తత్వానికి భిన్నంగా తాను లేదని అనుభవపూర్వకంగా గుర్తించడమే ఆధ్యాత్మికత, లేక ఆత్మజ్ఞానము లేక భగవదైక్యమని ఆధ్యాత్మికత చెబుతుంది.

యిలా వుంటే ఆధ్యాత్మిక శక్తులే అసత్యమని తలచరాదు. ఇప్పుడు మనకు అనుభవమయ్యే మూడు నిరూపకాలతో కూడిన ఆకాశము (space) భూత భవిష్యద్వర్తమానాలుగా గుర్తించబడే కాలము వాస్తవం కాదని ఇవి రెండూ కలిసి దేశకాలము (space time) అనబడు నాలుగు నిరూపకాలతోకూడినదే సత్యమని ఐన్‌స్టీన్ నిర్వచించిన సాపేక్షిక సిద్ధాంతము చెబుతుంది. ఇప్పుడు మన చైతన్యము అజ్ఞానము చేత మూడు నిరూపకాలతో కూడిన ఆకాశమే వాస్తవమని, కాలము దానికి భిన్నమని తలస్తుందని అర్థము. మన చైతన్యము అట్టి అజ్ఞానాన్ని అతిక్రమించినప్పుడు సృష్టి అంతటా ఎప్పుడూ, ఎక్కడ, ఏమి జరుగుతున్నా తెలుసుకొనగలగాలి. అట్టి స్థితిని పొందిన వారు చాలా కొద్ది మంది మాత్రమే వుంటారని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతాయి. కనుక త్రికాలజ్ఞత, సర్వజ్ఞత అనే అద్భుత శక్తులు శాస్త్ర విరుద్ధమనడానికి వీలులేదు. ఐన్‌స్టీన్ కనుగొనక ముందు అంతటి మేధావి పుట్టలేదని అర్థంగాని , అతడు నిర్వచించిన ప్రకృతి ధర్మము అంతకుముందు లేదని చెప్పలేము కదా!! అలానే అంతటి మహిమ చూపే వారు మనకు తారసిల్లనంత మాత్రాన అట్టి సామర్థ్యమే అసత్యమనడం శాస్త్ర విరుద్ధం. సమాజంలో మనకు కనిపించే వ్యక్తులలో ఎక్కువ మంది పరీక్షలలో కాపీ కొట్టారన్నంతమాత్రాన విద్య అనేది లేదనడం సమంజసం కాదు. అలానే నేడు నాస్తికులకు, హేతువాదులకు మహిమలున్నాయని నిరూపించగలవారు కనిపించనంత మాత్రాన ప్రకృతిలో అట్టివి లేనేలేవనడం శాస్త్రీయం కాదు.

మౌలికం అయిన ఆధ్యాత్మిక వాదాన్ని, తార్కికంగా అసత్యమని నిరూపించలేని వారెందరో భారత, రామాయణాదులను విమర్శించడంతో శ్రోతలను అసలైన సమస్యల నుండి ప్రక్కదారి త్రొక్కిస్తారు. ఆ గ్రంథాలు చారిత్రకమైనా కాకపోయినా వాటికాధారమైన ఆధ్యాత్మికత సత్యమైతే దానిని అనుసరించి ఎట్టి కొరతాలేని ఆనందాన్ని పొందడమొక్కటే నిజమైన తెలివితేటలు, తక్కినదంతా వ్యర్థ ప్రలాపమే! ఏమంటావ్?"

---


జై సాయి మాస్టర్!

దివ్యజనని అలివేలు మంగమ్మతల్లి ఆశీస్సులతో గురుపూర్ణిమ 2009 నుండి శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్‌వారి ప్రచురణలన్నింటిపై ప్రచార నిమిత్తం 35% Discount భక్తులకు శ్రీ మంగభరద్వాజ ట్రస్ట్ తరపున అందజేయుచున్నారు. వివరాలకు.......

08592 – 233271

September సంచిక తరువాయి

# వార్తాలాపము

(సీరియల్)

స్వా. ప్ర.:- తల్లి, తండ్రి, భార్య, పుత్రులు మొదలగువారి వియోగము జగమున నీ ఒక్కడికేకాదు. అనేకులకు కలిగినది. యోగవాశిష్ఠమునందు యీ విషయమున ఒక ఆఖ్యానము కలదు.

## పుణ్యపావనుల వృత్తాంతము

జంబూద్వీపమున మహేంద్రపర్వతముపైనున్న ఒక ప్రవాహతీరమున దీర్ఘతముడను ముని తన భార్యతోకూడ నివసించుచుండెను. అతనికి ఇరువురు బిడ్డలు. పెద్దవాడు జ్ఞాని. వాని పేరు పుణ్యుడు. చిన్నవాడు కొంతవరకు అజ్ఞాని. వాని పేరు పావనుడు. ముని వార్ధక్యమున దేహత్యాగము చేసెను. భార్యకూడ తన యోగశక్తిచే శరీరమును త్యజించి స్వామిని కలిసెను.

పావనుడు తల్లిదండ్రుల వియోగముచే మిక్కిలి దు:ఖించసాగెను. పుణ్యుడు అతనివద్దకు వచ్చి ఓదార్చెను. "అబ్బాయీ, పావనుడా! ఎందుకు ఏడ్చుచున్నావు? నీ తల్లిదండ్రులు ఆత్మపదమును పొందిరి. వారికి ఉత్తమోత్తమమగు పదవి లభించినది. నీవు దు:ఖించుటకు ఇందు కారణము ఏమి కలదు? శోకించరానిదాని కొరకు నీవు ఏల శోకించుచున్నావు? నీవు ఎవరకును కుమారుడవు కావు. ఎవరును నీకు తల్లిదండ్రులు కారు. నీకు ఇంతవరకు ఎందరో తల్లిదండ్రులు అయిపోయిరి. నీవు ఎందరకో కుమారుడవు అయితివి. ఋతువునసరించి వృక్షములకు కాయలు కాచి పండ్లు పండి రాలిపోవునట్లు జననమరణములు జరుగుచుండును. నీవు ఈ జన్మమందలి నీ తల్లిదండ్రులకొరకు శోకించుచున్నావు. కాని గడచిన జన్మలయందు అసంఖ్యాకులగు తల్లిదండ్రులు అయిపోయిరి కదా! వారికొరకు ఏల దు:ఖించుటలేదు? ఓ మహాభాగుడా! నీకు దృశ్యమానమగు ఈ ప్రపంచము జాగ్రుతమయిన భ్రమ. పరమార్థదృష్టిని చూచిన జగత్తులేదు. మిత్రులు ఎవరును లేరు. శత్రువులు ఎవరును లేరు. ఎండమావులు ఏవియో పెద్ద నదివలె కన్పించును. వానియందు ఒక నీటిబిందువయినను వుండదు. అటులనే జగత్తు అను వస్తువు ఏదియునులేదు. పరమార్థదృష్టిని విచారించినచో ఈ కన్పించునదంతయు భ్రాంతియనియు, మాయాదృష్టిచే మాటిమాటికీ ఉత్పన్నమగుచు, నశించుచు వుండును అనియు నీకు తెలియును. ఈ జగము అంతయు నీ సంకల్పముచే జన్మించినది. ఇందు సత్పదార్థము ఏమియును లేదు. నీకు స్ఫురించిన భావములే భాసించును. ప్రపంచమును గురించి ఎట్టి కల్పనలు చేయుదువో అట్లే అది నీకు కన్పట్టును. పత్నీభావము కలిగినచోట పత్ని భాసించును. పుత్రభావము కలిగినచోట పుత్రుడు భాసించును. బంధుభావముతో బంధువు, మాతాపితరుల భావనచే మాతాపితరులు కన్పట్టును. ఇట్లు ఇదంతయును భావనాధీనమగు ప్రపంచము అగుటచే బంధువులు ఎవరును లేరు. శత్రువులు ఎవరును లేరు. సర్వకాలములయందును ఒకే సర్వాత్మ వున్నది. యోగదృష్టితో చూచినచో పూర్వము అనేక పర్యాయములు నీవు పశు, పక్షి, జలచరాది అనేక యోనులయందు జన్మించితివనియు, ఆ సమయమున నీకు ఎందరో బంధుమిత్రాదులు వుండిరనియు తోచును. ఇప్పుడు నీవు వారినందరును గురించియు విచారించుటలేదు. ఏలనన ఇప్పుడు నీకు చాలకాలమగుటచే వారి జ్ఞాపకము లేదు. ఓ సోదరా, నీ వాసనను అనుసరించి నీవు జన్మించితివి. నేనుకూడ ఇటులనే అనేక జన్మలను పొందితిని. అజ్ఞానులే దేహేంద్రియాదుల గుణములతో తాద్రూప్యమును పొందుదురు. సుఖదు:ఖములను అనుభవించెదరు. జ్ఞాని దేహేంద్రియముల కర్మలను చేయుచున్నను కర్తకాదు. దర్పణమునందు ప్రతిబింబముపడినను దర్పణము సంతోషమునుకాని, దు:ఖమునుకాని పొందనట్లుగనే జ్ఞానికి రాగద్వేషములు కలుగవు. తన స్వరూపమునందు నిమగ్నుడయి వుండును. అటులనే నీవు మిథ్యయగు దేహభావమును త్యజించి నిత్య, శుద్ధ, శాంత, పరమానంద స్వరూపమునందు స్థితిని పొందుము. నీవు పరబ్రహ్మ స్వరూపము అయివున్నావు".

ఇట్లు పుణ్యుడు బోధించిన తదుపరి పావనునకు తన స్వరూపజ్ఞానమును కలిగెను. తల్లిదండ్రుల వియోగముచే కలిగిన శోకము నివృత్తిని పొందెను. ఈ విధముగా ఇరువురు సోదరులును ఎల్లప్పుడును ఆనందముతో నుండి ప్రారబ్ధకర్మము క్షీణించిన తరువాత నూనెలేని దీపము నిర్వాణము పొందునట్లు విదేహముక్తిని పొందిరి.

స్వా. ని.:- స్వామివారు చెప్పిన సంగతి నిజము. దేహమునందు ఆ ధ్యాస వున్నంతవరకు - అనగా "నేనే శరీరమును" అను భ్రాంతి వున్నంతవరకు దారాపుత్రాదులయందు మమత్వబుద్ధి యుండును. అందుచే అనేక రకములగు దు:ఖములు అనుభవించవలసివచ్చును.

ఈ విషయమున పద్మపురాణమున ఒక కథ కలదు.

పూర్వము తుంగభద్రా నదీతీరమున ఆత్మదేవుడు అను బ్రాహ్మణుడు కలడు. అతనికి ధుంధులి అను పేరుగల పేచీకోరు భార్య వుండెను. ఆయనకు సంతానము లేనందున దానధర్మాదులయందు తనకున్న ధనములో అర్ధభాగము ఖర్చుపెట్టెను. అయినను పుత్రుడు కాని, పుత్రిక కాని కలుగలేదు. అపుడు ఆత్మదేవుడు విరక్తికలిగి ఇంటిని విడచి వనమునకు పోయెను. మధ్యాహ్నకాలమున దాహము వేసినందున ఒక చెరువువద్దకు వెళ్ళెను. ఆతడు జలమును త్రావి చెట్టునీడను రెండు ఘడియలు కూర్చొనెను. అంతలో ఒక సన్యాసి ఆ మార్గమున వచ్చెను. ఆత్మదేవుడు నిట్టూర్పు విడచుచు నిలబడియుండెను. అట్లు బ్రాహ్మణుడు ఏడ్చుట చూచి సన్యాసి ఆతని దు:ఖమునకు కారణము అడిగెను. అంతట ఆత్మదేవుడు తన సంతానహీనత్వమునకు చెందిన కథనంతయు వివరించెను. ఇది వినినంతనే సన్యాసికి మిక్కిలి దయ కలిగెను. తన యోగబలముచే ఆతడు బ్రాహ్మణుని లలాటమున వ్రాయబడిన లిపిని చదివెను. అందు "నీకు ఏడు జన్మముల వరకును సంతానము లేదు" అను సంగతి వుండెను. అది చదివి సన్యాసి బ్రాహ్మణునితో నిట్లుచెప్పెను: "ఇప్పుడు నీవు పుత్రేచ్ఛను త్యజించుము. అందు సుఖములేదు. సగరుడు, అంగరాజు మొదలగు రాజులు సంతానముచే దు:ఖమును పొందిరి. కావున నీవు పుత్రేచ్ఛను విడనాడుము". ఇట్లు బ్రాహ్మణునకు ఎంత తెలియజెప్పినను అతడు శాంతించలేదు. మాటిమాటికి సంతతిని ప్రసాదించుడని సన్యాసిని కోరెను. "వరమునీయనిచో తమ చరణములయందు ప్రాణత్యాగము చేసెదనని" చెప్పెను. "ఈ ఫలము నీ భార్య తిని, ఫలాన వ్రతములను ఆచరించినచో సంతానము కలుగును" అని సన్యాసి చెప్పెను.

బ్రాహ్మణుడు సన్యాసికి నమస్కరించి, ఫలమును తీసికొని సంతోషముతో ఇంటికి వచ్చి, వృత్తాంతమునంతయు భార్యకు చెప్పి, ఫలమునిచ్చి ఇది తినుమని చెప్పెను. భార్య బ్రాహ్మణుని ఎదుట అటులనే అని సమాధానము చెప్పెను. కాని తరువాత గర్భధారణముచే కలుగు ప్రసవపీడను గురించి ఆలోచించి ఎన్నియో కుతర్కములను చేసి, తన ఆవునకు దానిని తినిపించెను. తనకు శ్రీమంతము చేసికొని తన సోదరి కుమారుని రహస్యముగా తీసికొనివచ్చి తనకు కుమారుడు పుట్టెనని నటించెను. తనకు కుమారుడు పుట్టుటచే ఆత్మదేవుడు ఎంతయో సంతోషించి ఆ కుమారుని పేరు ధుంధుకారి అని పెట్టెను. తరువాత ఫలమును తినిన ఆవునకు పుత్రుడు కలిగెను. అందరును ఆశ్చర్యపడిరి. ఆ కుమారుని కర్ణములు ఆవు చెవులవలె పొడవుగానుండుటచే గోకర్ణుడని అతనికి పేరుపెట్టిరి. ఎంతయో దు:ఖముతో కృంగిపోవు ఆత్మదేవుడు తనకు పుట్టిన ఇరువురు కుమారులను చూచుకొని మురిసిపోయెడివాడు. రోజులు గడచినవి. ఇద్దరును యువకులయిరి. గోకర్ణుడు మహాపండితుడును జ్ఞానియును అయ్యెను. ధుంధుకారి మహా కపటియు, మహా ఖలుడును అయ్యెను. అందుచే ఆతడు తన తండ్రి ఆస్తినంతను చెడ్డవారి స్నేహముతో నశింపజేసెను. తండ్రియగు ఆత్మదేవుడు దరిద్రుడయి, ఎన్నియో కష్టములకు లోనయి చాల దు:ఖించెను. ఆతడు ఆత్మహత్య చేసికొనుటకు తలపడెను. ఆ సమయమున గోకర్ణుడు తండ్రితో పలికెను: "తండ్రీ! ఈ ప్రపంచము పూర్తిగా సారహీనమైనది. దు:ఖరూపము. మిక్కిలి మోహమును ఉద్భవింపచేయును. కుమారుడెవడు? ధనమెవరిది? ఈ ప్రపంచముపై స్నేహమును కలిగియుండెడివాడే ఎప్పుడును దహించుకొని పోవుచుండును. చక్రవర్తికికాని, ఇంద్రునకుకాని ఏమియు సుఖమనునది లేదు. సుఖము విరక్తిని పొంది ఏకాంతమున జీవించు మునికి మాత్రమే కలుగును. నీవు అజ్ఞానమును త్యజించుము. ఈ శరీరము నశ్వరము. కావున సర్వస్వమును త్యజించి వనమునకు పొమ్ము". అంతేకాదు ఓ తండ్రీ!

ధర్మం భజస్వ సతతం త్యజ లోకధర్మాన్
సేవస్వ సాధుపురుషాన్ జహి కామతృష్ణామ్ ।
అన్యస్య దోషగుణచిన్తనమాశు ముక్త్వా
సేవాకథారసమహో నితరాం పిబ త్వమ్ ॥

"నీవు నిరంతరమును ధర్మమును సేవించుము. లోకాచారమును త్యజించుము. సత్పురుషులను సేవించుము. కామతృష్ణను విడనాడుము. పరుల

గుణదోషములను విచారించుటకు పూనుకొనకుము. త్వరగా భగవానుని సేవారసమును, కథారసమును పూర్తిగా పానము చేయుము".

ఈ విధముగా జ్ఞాని అగు తన కుమారుడు చెప్పిన మాటలు విని ఆత్మదేవుడు స్థిరబుద్ధిని పొంది గృహత్యాగము చేసెను. ఆతడు వనమును ప్రవేశించి మిగిలిన ఆయుర్దాయమును భగవచ్చింతనమునందు గడపి మోక్షపథమును పొందెను.

ఈ ప్రసంగము జరుగుచుండగనే ప్రేమజీభాయి అచటకు వచ్చెను. ఆయన ఏజన్సీలో ఉద్యోగముచేసి పింఛను తీసికొనుచుండిరి. వారు అచ్చటికి వచ్చి స్వామి నిత్యానందులవారికి నమస్కరించి పలికెను. "నేను ఈ మధ్యనే ఉద్యోగము చేయుచున్నాను. అందుచే పనియుండి ముందు రాలేకపోతిని. క్షమించుడు. స్వాములను ఇరువురను చూచు అదృష్టము కలిగినది. ఇది మహాభాగ్యము".

స్వా. ని.:- మీరు మేనేజరు ఉద్యోగము చేయుచున్నారని విన్నాను.

ప్రేమ:- ఏమి చేయను! బహుకుటుంబీకుడను. అందుచే ఉద్యోగము చేయవలసి వచ్చుచున్నది.

స్వా. ప్ర.:- (దీర్ఘ పరిచయముండుటచే వినోదమునకు) అనగా జీతముకొరకు మాత్రమే ఉద్యోగము చేయుటలేదన్నమాట. నౌకరులు, వాహనములు మొదలగు అధికారమును ప్రకటించు సాధనములకొరకు ఉద్యోగము చేయుచున్నారు. పరమాత్ముడు విముక్తిని ఇచ్చి జీవితము గడపుకొను సాధనమును ఇచ్చినను మరల బానిసత్వమునకు తయారయిరి. ఈ విషయమున దక్షిణదేశమునందలి దృష్టాంతమును ఒకదానిని వినుడు.

ఒక రాజ్యమునందు ఒక దివాను కలడు. రాజునకు ఒకరోజు రాత్రి రెండు గంటలకు ఆతని సలహా అవసరమయ్యెను. అందుచే దివానును తీసికొని రమ్మని ఇద్దరు మనుష్యులను కాగడాలతో దివాను బంగళాకు పంపెను. దివాను దర్బారులోనికి వెళ్ళు మార్గమున ఇద్దరు కట్టెలు అమ్ముకొనువాండ్రు గుడిసె బైట పరుండియుండిరి. దివానును కాగడాల వెలుతురులో గుర్తుపట్టి ఒకడు పలికెను: "అదుగో దివానుగారు వెళ్ళుచున్నారు" వెంటనే ప్రక్కన పరుండిన రెండవవాడు పలికెను: "ఈ దివాను మూర్ఖుడు". నిశ్శబ్దముగానున్న రాత్రియగుటచే ఆ మాటలు దివాను చెవిన పడెను. ఆయన తన మనుష్యుని ఆ మాటలు పలికినవారి పేర్లు మొదలగు వివరములు తెలిసికొని రమ్మని పంపెను. అనంతరము రాజుగారివద్దకు వెళ్ళి ఆయనకు సలహా చెప్పి తన బంగళాకు తిరిగివచ్చి నిద్రించెను. రెండవరోజున ఆ కట్టెలవాండ్రను ఇద్దరిని పిలచుకురమ్మని నౌకరునకు ఆజ్ఞాపించెను. దివాను ఏమి శిక్ష విధించునో అని వారు భయపడిరి. వణకుచు వారు దివానువద్దకు వెళ్ళిరి. రెండవవానితో దివాను పలికెను. "నిన్ను శిక్షించను. నీవు నన్ను మూర్ఖుడవని ఏల అంటివో తెలుపుము". వాడు పలికెను - "బాబూ! నేను కట్టెలు అమ్ముకొని బ్రతుకుదును. ఉదయము 5 గంటలకు లేచి అడవిలోనికి వెళ్ళి కట్టెలమోపును తీసికొనివచ్చెదను. వానిని అమ్మి రోజుకు 5, 6 అణాలు సంపాదించుకొనెదను. మధ్యాహ్నము పదిగంటలతో నేను నా పనికి స్వస్తి చెప్పుదును. తరువాతనున్న సమయమంతయు విశ్రాంతి తీసికొనెదను. రాత్రి నాకు ఎవడైన నూరురూపాయలు ఇచ్చెదనని నను బయటకు వెళ్ళను. ఏలనన, రాత్రి సమయము అలసిన శరీరమునకు విశ్రాంతినివ్వవలెను. తమరు రాత్రి సమయమున రాజుగారి సన్నిధికి వెళ్ళుచుండుట చూచిన నాకు తోచెను. తమరు రెండువేల రూపాయలు జీతము తీసికొనెదరు. ఇంత గొప్పవారు అయినను ఇదేమి బానిసత్వము! రాత్రికూడ విశ్రాంతి లేదే!. ఈ ఆలోచనలతోపాటు నా నోటినుండి "మూర్ఖుడు" అనుమాట వచ్చెను. నన్ను క్షమించుడు". దివానుగారు పలికిరి: "నీ మాటలు నిజము. నీవు నాకు గురువువు". అట్లు పలికి వెంటనే ఆయన రాజునకు తన రాజీనామా వ్రాసిపంపెను. రాజు తనంతట తానే వచ్చి నచ్చజెప్పెను. కాని దివాను తన నిశ్చయమునందు స్థిరముగానుండెను. "ఇంక బానిసత్వము చేయలేను" అనెను. ఈవిధముగా దివాను రాజీనామానిచ్చెను.

ఒక విద్వాంసుడు పలికెను.

సేవయా ధనమిచ్ఛద్భి: సేవకై: పశ్య యత్కృతమ్ ।
స్వాతన్త్ర్యం యచ్ఛరీరస్య మూఢైస్తదపి హారితమ్ ॥

"సేవచేసి ధనమును కోరు సేవకుల బ్రతుకు చూడండి. సేవకులకు శరీరస్వాతంత్ర్యము అయినను లేదు".

ప్రేమజీ:- నేను రాజ్యములో ఇంతకాలమువరకు ఉద్యోగము చేసెదనని నిర్ణయము చేసికొంటిని. ఇప్పుడు ఎట్లు విడవగలను? సమయము పూర్తి అయిన తరువాత క్రొత్త ఉపాధిని పెంచుకొనను.

స్వా. ప్ర.:- విడిపించుకొనుట ఏమిటి? వేరొక పెద్దరాజ్యమేది అయిన ఎక్కువ

జీతమిచ్చి అధికారము చలాయించనిచ్చినచో అక్కడికి వెళ్ళెదరు. ఇది ముసలమ్మ కథవలె వున్నది. పూర్వము ముసలమ్మ ఒక ఆమె కలదు. ఆమెకు చిన్నతనమునుండియు గోబిలు అనిన చాలాసరదా. ప్రతి నవరాత్రియందును ఎన్నియోమార్లు గోబిలు పాడించెడిది. పెద్దది అయి కొడుకులు, కోడండ్రు ఇంటికివచ్చిన తరువాత కూడా ఆమెకు గోబిలునందు ప్రేమ తగ్గలేదు. పెద్దదయి విధవగా జీవితము గడుపుచున్నను గోబిలు విని వారితో కలసి తానుకూడా పాడుచుండెడిది. ఒకమారు నవరాత్రికి ఆమె తన కుమారునితో గోబిలు చూచుటకు వెళ్ళెదనని చెప్పెను. కుమారుడు "అమ్మా, నీవు గోబిలు చూచుటకు వెళ్ళరాదు. ఈ వయస్సు గోబిలు చూడతగినది కాదు. వినుచు వినుచు నీవుకూడ వారితో కలసి పాడుటకు మొదలుపెట్టి మా గౌరవము పోవును. అందరును నవ్వుదురు". ముసలమ్మ పలికెను: "నేను శాంతముగా కూర్చొని గోబిలు చూచెదను. నేను ఏమియు చేయను. మాట్లాడనుకూడాను. నేను కోడలుతోకూడ వెళ్ళెదను" ఇట్లు చెప్పి ఆమె కోడలుతో గోబిలు చూచుటకు వెళ్ళెను. కొంచెముసేపు గోబిలు వినుటతో ఆమె తన్మయురాలయ్యెను. ముసలమ్మ శ్రుతి కలిపి పాడుచు నాట్యము చేయసాగెను. కోడలు చేయిపట్టుకొని లాగినను వెనుకకు రాలేదు. "ఉండలేకపోవుచున్నాను" అని అంతకంతకు ముసలమ్మ ఆ గోబిలు పాడువారితో శ్రుతి కలిపెను.

ప్రేమజీభాయి కూడ ఆ ముసలమ్మవంటివాడే. మీరు కూడ శ్రుతి కలిపి నాట్యము చేయుదురు. మిమ్ములను నమ్మువారు ఎవరు?

స్వా. ని.:- తమరు అనుచున్నారు కనుక ప్రేమజీభాయి నవ్వుచున్నారు. లేనిచో వారి స్వభావము చాల కఠోరమైనది. ఎవరును వారి ఎదుటకు రాలేరు.

స్వా. ప్ర.:- నాకేమి భయము. నేను నిజము చెప్పుచున్నాను. నాకు ఆయన ఇచ్చిన భూములు ఏమైన తీసికొనెదరా?

ప్రేమజీ:- స్వామివారికి నాయందు దయ. అందుచే వారు నా హితమును కోరి చెప్పెదరు.

స్వా. ప్ర.:- బొంబాయిలో మోతీలాల్ దలపత్‌రామ్ అను నా స్నేహితుడగు సొలిసిటరు ఒకడుండెను. ఆయన సదాచారియు నిష్ఠాగరిష్ఠుడును. ఆయనకు తన వృత్తినుండి తప్పుకొనవలెనను కోరిక తన 46వ సంవత్సరమున కలిగెను. అది విని ఆయన భార్య, పుత్రుడు చాలా కోపించిరి. నాకు తెలిసి నేను వారికి "ఇంకను కొంచెము కాలము గడుపుట మంచిది" అని ఉత్తరము వ్రాసితిని. ఆయన ఉత్తరమునకు జవాబు ఇవ్వలేదు. కాని నేను బొంబాయి వెళ్ళినప్పుడు ఇట్లు చెప్పెను: "ఉత్తరమునకు 'కాదు' అని సమాధానము వ్రాసినచో తమ మాటను తిరస్కరించినట్లగును. కాని నా మనస్సు నివృత్తిచెందుటకు దృఢముగా నిశ్చయించుకొనినది". అంతట నేను వారిని "మీ జీవితము గడపుకొనుటకు సాధనములు కలవా" అని అడిగితిని. ఆయన సమాధానము చెప్పెను: "బ్రతుకుటకు వున్నది. విలాసమునకు లేదు. జీవితమంతయు ఎట్లు వ్యర్థము చేయుదును? నా శ్రేయము కొరకు ప్రయత్నించవలదా!" ఈ మాటలు విని నేను ఊరకొంటిని. అనంతరమున 'ఊరణ'లోని ఒక తోటలో చిన్న ఆశ్రమమువంటి ఇంటిలో వుండెడివాడు. నిరంతరము ధ్యానపరాయణుడయి పరమార్థ చింతనమునందు కాలక్షేపము చేసెడివాడు.

ప్రపంచమున అట్టి జనులు లేరనికాదు. తక్కువగానుందురు. స్వామి శ్రీ నిత్యానందులవారు ఇది విని ఎంతయో సంతసించిరి. "మరల కలియుట ఎప్పుడు?" అని అడిగిరి. శ్రీ స్వామి ప్రకాశానందులవారు సమాధానము చెప్పిరి: "కొద్దిరోజుల తరువాత తప్పక వచ్చెదను". అనంతరము స్వామి శ్రీ నిత్యానందులవారు పీఠడియా వెళ్ళుటకు నిశ్చయించిరి. శ్రీ ప్రకాశానందులవారిని విడచివెళ్ళుట అనిన శ్రీ నిత్యానందులవారికి ఎట్లుండునో వారి ముఖముద్రనుండి వెల్లడి అగుచుండెను. వారి హృదయము ఎంతయో దు:ఖించుచుండెను.

వైద్య:- తమ వియోగమనిన స్వామివారికి ఎంతయో కష్టము. స్వామివారి హృదయము చాలా కోమలమయినది.

---


చదవండి! చదివించండి!

**ధ్యానయోగ సర్వస్వము**

రచన: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రతులకు: శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, M.M.Donka,

Ongole - 523 002, 08592 - 233271

# శ్రీ భరద్వాజ లేఖామృతము

OM SADGURU SRI SAINAADHAYA

E. Bharadwaja M.A.
DWARAKAMAYI
P.O. VIDYANAGAR-524413
Nellore Dt. (A.P.)

Date 15/7

[illegible] ... 'Oh my master master' ... Act ... pen ... fair copy ... [illegible]

[illegible] ... MICi ... Interview in Hyderabad ... T.M. ... [illegible]

[illegible]

# శ్రీ భరద్వాజ లేఖామృతము


OM SADGURU SRI SAINAADHAYA

E. Bharadwaja M.A.,
DWARAKAMAYI
P.O. VIDYANAGAR-524413
Nellore Dt. (A.P.)

Date

Om Sadguru Sri Sainaadhaya

E. Bharadwaja M.A.,
Dwarakamayi
P.O.VIDYANAGAR-524413
Nellore Dt.(A.P)

Date : 15/7

చి॥ శ్రీదేవికి

ఆశీస్సులు. జాబులు చేరాయి. ఇక్కడంతా క్షేమం. మంగక్క మోచేయి నెప్పి చాలా వరకు తగ్గింది. అయితే వ్రాయటానికింకా పట్టుకుదరలేదు. సులోచనగాని, ఉమాగాని పనిలో సహాయంచేస్తున్నారు. మందిరంపని మందంగా ఆరంభమవుతుంది. పాప బాగా ఆడుకుంటుంది. మాటలు బాగా వస్తున్నాయి. 'పాండురంగ విఠలా' (పానన్నా పితలా) అంటూ పాడుతుంది. 'Oh my master master E.B.' అని సత్యం వ్రాసిన పాట టేపువింటూ ఎగురుతుంది. పిల్లలోస్తే కూచో(తో) అని భజన ('గూ.. జైజై','చియాయి అయా') ('గురునహరాజ్ జైజై', 'శ్రీ సాయి సాయి') అంటూ చేయమంటుంది. తను చేసిన పనులకు తానే మన బదులు 'అబ్బో' అంటుంది. అమ్మ, నాన్న, తాత, అన్న, మామ, అక్క, పాప, బాబు, ఒకటి, రెండు, అన్న అంకెలు 5 వరకు వచ్చాయి. బావినుంచి చిన్న గిన్నెతో నీళ్లు తెస్తుంది. గుడ్డలుతకటం, చిమ్మటం, గిన్నెలు తోమటం చేస్తుంది. పుస్తకంలో బొమ్మలు గుర్తుపడుతుంది. పక్షుల, జంతువుల అరుపులు చెబుతుంది. 'ఆకలైన నక్క ఒకటి తోటలోకి పోయెను' అంటే act చేస్తుంది. అమ్మమ్మ వత్తులు చేయడం దగ్గర నుండి అన్నీ గుర్తుగా చెబుతుంది. చెట్ల పువ్వులుకోసి బాబాకు పెట్టి సాష్టాంగ నమస్కారం చేస్తుంది. నేను గాని అన్న లెవరన్నా ఊరికెడితే 'అన్న ఆచ్' అని చెబుతుంది. దామోదర్ వాళ్ల అవ్వ 'అబ్బాయా' అనడాన్ని చెబుతుంది. ఇవి దాని ఆటలు.

సుద్ద, pen దొరికితే 'గగ్గ' (ముగ్గు) అంటూ గీస్తుంది. సత్సంగం, భజన బాగా జరుగుతున్నాయి. త్రిపురారహస్యమను అద్వైత గ్రంథం చదువుతున్నాము. సత్యం 2,3 వారాల కొకసారి వచ్చి వెడుతున్నాడు. తాజుద్దీన్ చరిత్ర fair copy తీశాడు. ఆరోగ్యం బాగుంటూంది. మా నాన్న గారి ఆరోగ్యం బాగుంటూంది.

అక్కడ మీ సత్సంగ పారాయణలు, నీ సాయిలీలామృత రచన, బాగా సాగుతున్నాయని తలుస్తాను. అనసూయ result తెలియలేదు. అమ్మగారి ఆరోగ్యం, సాధన ఎలా వున్నాయి? బహుశ: మందిరం పని పూర్తయే దాకా మేమెక్కడికీ వెళ్లలేము. వచ్చే గురువారం గురుపూర్ణిమ అని తెలుసనుకుంటాను. విశేషాలతో జాబు వ్రాయండి. శ్రీ సాయి సదామిమ్మనుగ్రహించుగాక! అమ్మకు నమస్కారములు. మీకందరికీ ఆశీస్సులు. MICI నుంచి ఒక్కరికి 17th interview కు Hyderabad రమ్మని వచ్చింది. అనసూయ వెళ్లే లోపు T.M. చేయించుకోడం మంచిది.

ఇట్లు
ఆశీస్సులతో
భరద్వాజ

చి॥ లక్ష్మికి

ఆశీస్సులు. జాబు చేరినది. పరిక్ష పోయినందుకు నిరుత్సాహ పడవద్దు. జయాపజయాలు పగలు, రాత్రిళ్ళు లాగా సహజం. సాయిబాబా అంతటివారు మోహిద్దీన్ తంబూలీ అనే వాడి చేతిలో కుస్తీలో ఓడిపోయారు. తనివ్వగల జ్ఞానాన్ని కోరగల భక్తులెవరూ రానందుకు భాధపడేవారు. ఇంక మనకెలా తప్పుతుంది? అయితే పరాజయానికి చాలా విలువ వుంది. అహాన్ని అణుస్తుంది. మన కతీతమైన శక్తి వుందని తెలుపుతుంది. మంద బుద్ధులు ఆ దిగులుతో ఊరుకుంటారు. దాన్ని మరచి తిరిగి పశుప్రాయమైన పామర జీవితంలో మునిగి పోతారు. బుద్ధుడి వంటివారు బాగా యోచనచేసి దు:ఖాన్ని అతిక్రమించి శాశ్వత కీర్తి స్వరూపులై మానవాళికి దారి చూపుతారు. తక్కినవారు సాధించేదొక్కటే- సాధ్యమైన మేరకు బియ్యాన్ని మలంగా మార్చడం, సాటి ప్రాణులకు దు:ఖం, సాటి వారికి అవివేకం కలిగించి, భూభారమయ్యే మరోనలుగురిని తయారు చేసి కాలగర్భంలో కలుస్తారు. వారు బ్రతికినందువల్ల ప్రపంచం మరింత కలుషితమవ్వడమేగాని మెరుగవదు. కనుక అపజయం గొప్పజల్లెడ. పనికొచ్చే ముత్యాలనుండి పనికి మాలిన చెత్తను జల్లెడ వేస్తుంది. ముత్యాల వంటి వారు కష్టాల పారుదలలో కరుగరు. ఎక్కడున్నా మానవాళి వారిని వెతికి, పూజించి, ఆరాధిస్తుంది- సాయిబాబా నిరాడంబరంగా పేదఫకీరుగా బ్రతుకుతున్నా ఆరాధించినట్లు.

మనబోంట్లు లోకానికి మన గొప్పను, తెలివినీ, అందాన్ని చాటు కోవాలని చూచినా ఈగల వంటి హీనులు ఆకర్షింపబడవలసిందే గాని తేనెటీగల వంటి వివేకులు చూడనైనా చూడరు. చూచినా మన వెలితికి అసహ్యము, జాలి చెందుతారు. కనుక ముత్యాలమయ్యే ప్రయత్నం, యోచన చేయాలి. అట్టి వారికే దారి చూపి సహకరిస్తారు. రవికి ఇది తెలుపాలి అని యత్నించాను. ఎవరికేది ప్రాప్తమో ఎవరు చెప్పగలరు?

బాబా నీకు ధైర్యాన్ని, సద్బుద్ధినీ ఇచ్చి నీ జీవితాన్ని సార్ధకం చేయుగాక!

ఇట్లు
ఆశీస్సులతో
భరద్వాజ

గురుపుత్రిక శ్రీమతి వేదవతిగారికి జన్మదిన సందర్భంగా
శ్రీ సాయి మాస్టర్ ఆశీస్సులకై ప్రార్ధిస్తూ
మీ "సాయిబాబా"

# శ్రీ దత్తలీలామృతము

September సంచిక తరువాయి

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)

- శ్రీమతి శ్రీదేవి

"అలర్కా! యోగి ప్రాణాయామ సాధనవలన పొందే నాల్గుదశలలో మొదటి దశ ధ్వస్తి. ఆ దశలో అతని పుణ్య పాపకర్మములన్నీ ధ్వంసమైపోతాయి. అంటే అతని కర్మక్షాళనము కావటంవలన అతడు సంచిత ప్రారబ్ధ కర్మలనుండీ విముక్తుడౌతాడు. రెండవ దశ అయిన ప్రాప్తి అనుదశలో అతడు యిష్టకామ్యార్ధసిద్ధి పొందుతాడు. అంటే అతని ఐహికములైన కోరికలు, పరమార్ధమునకు సంబంధించిన కోరికలు కూడా సఫలమౌతాయి.

మూడవదైన సంవిద్దశలో అతడు ఎంతో దూరములో జరుగుతున్న విషయాలను తెలిసికోగలుగుతాడు. చూడగలుగుతాడు. జరిగిన, జరుగుతున్న, జరుగబోవు విషయాలను, సంఘటనలన్నింటినీ అతడు చూడగలుగుతాడు. గొప్ప శక్తి సమన్వితుడౌతాడు. నాల్గవ దశ అయిన ప్రసాదము అను దశలో అతడు యిక పొందవలసినదేమీలేని స్థితిని పొందుతాడు. అంటే అతని యింద్రియములు, యింద్రియార్ధములు సఫలమౌతాయి. అప్పుడతడు బ్రహ్మానందస్థితిని చేరుకొన్నవాడౌతాడు. కనుక రాజా! యోగసాధనచే యీ విధముగా ముక్తిని సాధించవచ్చు.

ఇక యిప్పుడు యోగాభ్యాసం చేసే విధానాన్ని నీకు తెలియపరుస్తాను.

మొట్టమొదట సాధకుడు పద్మాసనము, అర్ధపద్మాసనం లేక స్వస్తికాసనం – వీటిలో ఏ ఆసనం తనకు అనుకూలంగా అనిపిస్తే ఆ ఆసనములో సుఖముగా కూర్చోవాలి. వెన్ను వంచకుండా నిటారుగా నిలిపి, శిరస్సును కూడా సమానాంతరముగా నిలిపి, నోటిని మూసి వుంచాలి. దంతములను ఒకదానితో ఒకటి తగులనీయకూడదు. దిక్కులు చూడకూడదు. నాసికాగ్రములో దృష్టి నిలపాలి. హృదయంలో ఓంకారాన్ని స్మరించాలి.

మనస్సును నిర్మలముగా వుంచుకొని శుద్ధసత్త్వములో నిలుపుకొనాలి. అంటే మనస్సును ప్రశాంతంగా వుంచుకోవాలి. బాహ్యవిషయములపై నుండి పూర్తిగా మనస్సును మరల్చి, యింద్రియములను, మనస్సును భౌతిక విషయములపైకి చలింపనీయక, అంతర్ముఖుడై వుండాలి. కోరికలను నిగ్రహించుకొనుట కనుక యీ స్థితిని ప్రత్యాహారము అంటారు.

ప్రాణాయామములో మూడు దశలుంటాయి. అవి – పూరకము, కుంభకము, రేచకము. అలాంటి ప్రాణాయామములు 12 అయిన ఒక ధారణ అని పిలువబడుతుంది. రెండు ధారణలు యోగము అంటారు. యోగము వలన మానసిక దోషములన్నీ తొలగిపోతాయి. మనస్సు నిశ్చలమౌతుంది. యోగముచే ఆత్మసాక్షాత్కారాన్ని సాధించగలుగుతారు.

యోగాభ్యాసము చేయువాడు మితాహారి అయి పట్టుదలతో ఎంతో కృషి చేయవలసి వుంటుంది. తొందరపడక నిలకడగా సాధనచేస్తూ నెమ్మది నెమ్మదిగా ఉన్నత స్థితిని సాధించవలసి వుంటుంది.

ప్రాణవాయువు కదలకుండా నిరోధించిన ప్రాణాయామమగును. అటు తర్వాత యింద్రియాలను శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు అనే భౌతిక విషయాల పైకి పోకుండా మరలించుకొనుట ప్రత్యాహారము అనబడుతుంది. అటు తర్వాత మనస్సును కదలకుండా నిరోధించటమే ధారణ అని అంటారు.

ఈ ధారణలో 'మనస్సును ఎలా నిలపాలి' అన్న అంశంలో – మనస్సును నిలుపవలసిన పది స్థానములను తెలియజేస్తాను. అవి – నాభి, హృదయము, ఉరము, కంఠము, ముఖము, నాసికాగ్రము, నేత్రములు, భ్రూమధ్యము, మూర్ధము, బ్రహ్మరంధ్రమునకు పై భాగము. ఈ చివర భాగము ఆత్మైక్యమును ప్రాప్తింపజేస్తుంది.

అయితే, ప్రాణాయామము చేసే విధానంలో చాలా జాగ్రత్త వహించాలి. తామర తూండ్లలోపలి సన్నని రంధ్రమునుండీ నీటిని పీల్చటానికి ఎంత నెమ్మదిగా పీల్చుతామో పూరకస్థితిలో అంత నెమ్మదిగా నెమ్మదిగా కొద్ది కొద్దిగా గాలిని పీల్చవలసి వుంటుంది. ఆ తర్వాత రేచక స్థితిలో కూడా అదే విధంగా నెమ్మది నెమ్మదిగా విడువవలసి వుంటుంది. అలాకాక ప్రాణాయామ విధానంలో అజాగ్రత్తతో వ్యవహరించినట్లయితే శ్వాస సంబంధిత వ్యాధులు అంకురిస్తాయి.

ఇవికాక ప్రాణాయామ సాధనలో మరెన్నో నియమ నిబంధనలున్నాయి. ముఖ్యంగా – ఆకలి వేస్తున్నప్పుడు, అలసిపోయి వున్నప్పుడు, వ్యాకులతతో వున్నప్పుడు యోగాభ్యాసం చేయకూడదు.

ఉష్ణ తీవ్రత ఎక్కువగా వున్న కాలంలోగానీ, బాగా శీతలముగా వుండే కాలంలోగానీ ప్రాణాయామం చేయకూడదు. పెనుగాలి వీచే సమయంలో – యోగాభ్యాసం చేయరాదు.

యోగాభ్యాసం చేసే ప్రదేశాలు కూడా అనుకూలమైనవిగా వుండాలి. ఎప్పుడూ శబ్దాలు, పెద్ద పెద్ద చప్పుడులూ వుండే చోటగానీ, చెమ్మగా, తడిగా వుండే చోటగానీ, పాములు, తేళ్ళు మొదలైన విషప్రాణులు, కీటకములు సంచరించే చోటగానీ, భీతి కలిగే ప్రదేశంలోగానీ కూర్చుని యోగాభ్యాసం చేయకూడదు.

నదులు, బావులు వుండేచోట, ఎండుటాకులతో నిండిన ప్రదేశంలో, నాలుగు బాటలు కలిసే ప్రదేశంలోను, పాము పుట్టలుండేచోట, రచ్చపట్టులలోను యోగాభ్యాసం కూడదు.

మనస్సు సాత్త్వికముగా వున్నప్పుడే యోగాభ్యాసం చేయాలి. మలమూత్రములు విసర్జించకుండా వున్నప్పుడుగానీ, భోజనం చేసిన వెంటనేగానీ యోగాభ్యాసం కూడదు.

అలర్కా! యోగాభ్యాసములో నియమనిబంధనలను తప్పకుండా పాటించవలసి వుంటుందని చెప్పాను కదా! నియమాలను లెక్కచేయకుండా యోగాభ్యాసం చేసే మూర్ఖులు శారీరకమైన ఎన్నో రోగములబారిన పడవలసి వస్తుంది. గ్రుడ్డితనము, మూకత్త్వము, జడత్వము, బధిరత్త్వము, మతిమరపు, దీర్ఘజ్వరము మొదలైన వ్యాధులు సంక్రమిస్తాయి. నియమాలను పాటిస్తూ ఏదైనా పొరపాటుగా కానీ అనుకోకుండా జరిగిన అజాగ్రత్త చర్యలవలనగానీ వ్యాధులు సంక్రమిస్తే వెంటనే ఆ వ్యాధులకు చికిత్స చేసుకోవలసి వుంటుంది. అటువంటి సమయాలలో మెత్తని వేడి వేడి జావను త్రాగి ధారణ చేయాలి. దేహంలో ఏ విధమైన రోగములు వస్తాయో ఆయా వ్యాధులకు తగినట్లుగా అవి శాంతించేలాగా మనసులో ధారణలు మననం చేయాలి. ఎక్కువ ఉష్ణముతో బాధపడుతుంటే చల్లదనాన్ని ధారణచేయాలి. శీతల వ్యాధిగ్రస్తుడైతే ఉష్ణమును మననం చేయాలి. వణుకు వ్యాధిగ్రస్తుడైతే స్థిరముగా నిలచివున్న మహాశైలాన్ని (కొండ) ధారణ, మననములు చేయాలి. అతి దాహము కలిగితే నాలుకపై ఉసికర పండును వుంచుకొనాలి. చెవుడు వస్తే చెవులతో మంచివాక్కులను ధారణ చేయాలి. స్మృతిలోపము – అంటే మతిమరపు వస్తే శిరస్సుపై ఒక మేకును తాకించి, దానిపై చెక్కనుపెట్టి మరియొక చెక్కతో నెమ్మదిగా కొట్టిన స్మృతి వస్తుంది. శరీరభాగాలలో అనుకోని విధంగా బాధలు కలిగితే వాటికి తగినట్లుగా పృధివి, వాయువు, అగ్ని, నీరు, ఆకాశములను ధారణ చేయాలి. దేహములోపల ఆ బాధలు కలిగితే వాయుము, అగ్ని ధారణలతో ఆ బాధలను కాల్చివేయాలి.

చూడు రాజా! ధర్మార్థ కామ మోక్షములకు శరీరమే ముఖ్యసాధనం. కనుక యోగి అయినవాడు శరీరమును ఎంతో శ్రద్ధతో కాపాడుకొనాలి. యోగసాధనలో గల మరొక ముఖ్య నియమం ఏమంటే, యోగాభ్యాసం చేసేటప్పుడు అతనికి ఎన్నో యోగసిద్ధులు వస్తాయి. తనకు కలిగిన ఆ యోగసిద్ధులకు ఆశ్చర్యపడి అతడు వాటిని గురించి యితరులతో ఎంతమాత్రం చెప్పకూడదు. చెపితే, అవిపోతాయి. కాబట్టి వాటిని అతడు ఎంతో రహస్యముగా వుంచుకొనాలి గానీ ఎవ్వరికీ తెలియజేయకూడదు.

రాజా! చాపల్యము లేకపోవటం, ఆరోగ్యంగా వుండటం, మృదువైన స్వభావం కలిగివుండటం, శరీరకాంతి పెరగటం, సువాసనా భరితమైన శరీరము, ఎంతో ప్రశాంతంగా, ప్రసన్నంగా వుండటం, ఎంతో సౌమ్యమైన మృదుస్వరంతో మాట్లాడటం, మలమూత్రములు అల్పముగా వుండటం – యివి యోగసిద్ధిలో మొట్టమొదటగా కనిపించే లక్షణాలు. ప్రజలంతా తనయందు ప్రేమతో వ్యవహరించటం, తన పరోక్షంలో తన గురించి కీర్తించటం, సాధు జంతువులు తనను చూచి భీతిచెందకుండా వుండటం, మనస్సులో కోపావేశములుగానీ, శరీరానికి శీతోష్ణాది బాధలుగానీ లేకపోవటం అనేవి యోగసిద్ధి లక్షణాలు.

ఈ విధంగా శ్రీ దత్తాత్రేయస్వామి యోగమును గురించి అలర్కునకు ఉపదేశించారని కొడుకు తండ్రికి వివరించాడు.

అపుడా తండ్రి "నాయనా! స్వామి అలర్క మహరాజుకు యింకా ఏమేమి చెప్పారు?" అని అడిగాడు. సుమతి యిలా చెప్పసాగాడు.

శ్రద్ధతో స్వామి మాటలనాలకిస్తున్న అలర్క నృపాలునితో శ్రీ దత్త యోగీంద్రుడిలా అన్నాడు –

"నృపాలా! యోగసాధన అనేది సామాన్యమైన విషయంకాదు. యోగికి యోగసిద్ధులు లభించినట్లే, ఎన్నో ఆటంకాలు కూడా ఎదురౌతాయి. యోగసాధనలో

కలిగే అనేక యోగవిఘ్నముల గురించి చెప్తాను.

యోగికి సాధన సమయంలో అనేక సిద్ధులు వస్తాయని చెప్పాను కదా! ఆ సిద్ధులకు అతడు ఆకర్షితుడై సహజమైన తన మానవాభిలాషలను నెరవేర్చుకోజూస్తాడు. అతని మనస్సు స్త్రీలను వాంఛిస్తుంది. ఎన్నో దానఫలాలను ఆశిస్తుంది. అనేక విద్యలను కైవసం చేసుకొనటం, బంగారం వంటి లోహములను సృష్టించడం, దేవతలను వశపరచుకొనటం, దేవతలపై ఆధిపత్యం వహింపబూనటం, ప్రకృతిశక్తులైన వాయు, అగ్ని, జలములను నియంత్రించటం, మంత్రసిద్ధులు పొందటం, తను కోరినవన్నీ సాధించుకొనగల శక్తిని కలిగియుండి ఆ కోర్కెలు నెరవేర్చుకోబూనటం, యింకా ఎన్నెన్నో దైవశక్తులను పొందడం – యిలాంటి శక్తులు కలగటం వలన అతడు ఆశతో, వ్యామోహంతో ప్రాపంచిక కోర్కెలను నెరవేర్చుకొనేందుకు సిద్ధపడతాడు. అప్పుడు అతని యోగము భగ్నమైపోతుంది. అతడు పూర్తిగా పతనమౌతాడు. కనుక యోగి అటువంటి వ్యామోహాలకు లోనుకాక తన మనసును మరల్చుకొని పరబ్రహ్మమునందు లగ్నముచేయాలి. ఆ విధంగా తనకు కలిగిన శక్తులను తిరస్కరించి మరలా యోగనిష్ఠుడై సాధనచేస్తున్న సమయంలో అతడికి మరలా అత్యంత శక్తివంతమైన ప్రాతిభము, శ్రావణము, దైవము, భ్రమము, ఆవర్తము అనే ఐదు విధాలయిన మహాశక్తులు కలిగి అతని యోగమునకు భంగము కలిగే పరిస్థితి ఎదురౌతుంది. యోగికి కలిగే యీ ఐదు విధాలయిన సిద్ధులను వివరిస్తాను.

వేదములు, పురాణములు, యితిహాసములు, కావ్యములు, సకల శాస్త్రములే కాక శిల్పము, సంగీతము, కవిత్వము వంటి కళలన్నీ యితడు ఏమీ నేర్చుకొనకుండానే, యితని ప్రయత్నమేమీ లేకుండానే యితనికి స్ఫురిస్తాయి – ఈ సిద్ధిని ప్రాతిభము అంటారు.

ప్రపంచంలోని సకల శబ్దాలు – యితడు వినగోరినవన్నీ యితనికి వినిపిస్తాయి. వేలాది మైళ్ళదూరంలో వున్నప్పటికీ సకల విధములయిన శబ్దములు యితడు వినగలుగుతాడు. చివరకు పశుపక్ష్యాదులు, మృగముల శబ్దములు, వాటి అర్థాలు కూడా తెలుసుకొనగలగిన శక్తిని యోగి పొందుతాడు – ఈ సిద్ధిని శ్రావణము అంటారు.

దేవతలను, పితృదేవతలను, యక్షులను, గంధర్వులను, సిద్ధులను, కిన్నెరలను, విద్యాధరులను, పిశాచములను యితడు చూడగలడు – దీనిని దైవము అంటారు.

ఏ ఆలంబనా లేకుండా మనస్సు సంకల్పించినంతమాత్రాన యితడు సూక్ష్మ శరీరముతో ఎక్కడికయినా వెళ్ళగల శక్తి పొందుతాడు – దీనిని భ్రమము అంటారు.

అన్ని విధాలయిన దివ్యశక్తుల జ్ఞానము సుడిగుండంలో నీరువలె యితనిలో గిర్రున తిరుగుతూ వుంటుంది – దీనిని ఆవర్తము అంటారు.

ఈ అయిదు శక్తులు యోగి వెంటపడినపుడు అతడు వానినన్నింటినీ తిరస్కరించి, తెల్లని కంబళి కప్పుకొని పరబ్రహ్మధ్యాన నిమగ్నుడు కావాలి.

రాజా! ఇక సూక్ష్మమైన ధారణా సప్తకము గురించి చెప్తాను. మొట్టమొదటిగా యోగి జితేంద్రియుడు, ఆహార విహార నియమములను నిష్ఠతో పాటింపగలవాడు అయివుండాలి. అతడు శిరస్సుపై పృథివీతత్త్వాన్ని భావించి, ఆ భావనలో మమేకమై ఆ తర్వాత ఆ భూతత్త్వాన్ని తననుండీ పూర్తిగా విసర్జించినట్లు భావనచేయాలి. అదేవిధంగా వరుసగా మిగిలిన జలము, అగ్ని, ఆకాశము, వాయువు అనబడే పంచభూతములను కూడా తనలో భావించుకొని తన్మయుడై వుండి, ఆ తర్వాత వాటి గుణాలయిన రస, రూప, స్పర్శ, శబ్దములనే లక్షణాలను విడిచిపెట్టినట్లు భావనచేయాలి.

ఈ విధంగా తనలోని పంచభూత తత్త్వాలను విడిచిపెట్టిన తర్వాత తనలోని మనోబుద్ధులను సర్వభూతముల మనోబుద్ధులలో మమేకం చేసుకొని అటు తర్వాత వాటిని విడిచిపెట్టాలి.

రాజా! పైన చెప్పిన ఏడు తత్త్వాలతో ప్రపంచం నిండివున్నది కనుక యీ ఏడు తత్త్వములను విడిచిన యోగి ప్రాపంచిక మాయవలన ప్రభావితం కాక దైవత్వాన్ని పొందగలిగిన స్థితిని చేరుకుంటాడు. అతడు తప్పక ముక్తిని పొందుతాడు. అంతేకాదు, ఈ ఏడు వృత్తులను పొందిన యోగి తన పూర్వ సంచిత ప్రారబ్ధ కర్మవశాన ఎటువంటి జన్మను పొందినప్పటికీ ఆ దేహబద్ధుడుకాక నిస్సంగుడై వర్తిస్తాడు. అంటే అతడు దేవ, అసుర, ఉరగములవంటి దేహములను పొందినా ఆ జన్మతత్త్వ మమకార వికారాదులకు బద్ధుడుకాక నిర్లిప్తుడై జీవిస్తాడు. అతడే శుద్ధాత్ముడు, యోగసిద్ధుడు.

రాజా! ఆ యోగికి అణిమాది అష్టసిద్ధులు లభిస్తాయి. వాటి గురించి వివరిస్తాను.

అణువుకంటే కూడా అతి సూక్ష్మత్వాన్ని పొందగలిగిన శక్తిని పొందటమే అణిమ అని అంటారు. యావత్ప్రపంచముచేత పూజింపబడే శక్తి పొందటమే మహిమ అని పిలువబడుతుంది. అటువంటి యోగి ఎంతో త్వరితగతిన ఎక్కడికైనా వెళ్ళగలడు.

ఆ శక్తినే లఘిమ అంటారు. అటువంటి యోగి, ఇక పొందవలసినదేదీ లేని స్థితికి చేరుకుంటాడు. అతనికి సర్వము ప్రాప్తిస్తుంది. ఈ స్థితిని ప్రాప్తి అంటారు. ఇక అయిదవ సిద్ధి ప్రాకామ్యము. ఆ యోగి సర్వత్ర తానై వ్యాపించిన తత్త్వముతో మమేకమౌతాడు. అదే ప్రాకామ్యము. సకల లోకాలకు అధిపతి అవటమే ఈశిత్వము. సమస్తము అతనికి వశమవటమే వశిత్వము. ఇక చివరిదైన పరము అంటే – అదే గమ్యం అని చెప్పవచ్చు. అదియే పొందవలసిన స్థితి. సకల సిద్ధులకు సకల ఐశ్వర్యములకు అదియే ఎల్లయై భాసిస్తుంది. అయితే దానిని గూడ దాటి, ఈ అష్టసిద్ధులన్నీ వదలినప్పుడే నిర్వాణం ప్రాప్తిస్తుంది. అదియే ముక్తి అని చెప్పబడుతుంది.

ఆ విధంగా ముక్తిని పొందిన యోగికి తిరిగి మాతృగర్భవాస నివాసము, జన్మించటము, పెరగటము, ముసలితనాన్ని పొందటం, ఆపై అతని శరీరం కృశించిపోవటం, చివరగా మరణించటం – అనే ఆరు విధములయిన స్థితులు వుండవు. ఈ భూమిపై పుట్టి ప్రపంచ సంగమం వలన అనేకానేక బాధలు పొందవలసిన స్థితి యితనికి వుండదు. ఎటువంటి కర్మానుభవములు యితనికి వుండవు. ఎందుకంటే యితడి సంచయప్రారబ్ధకర్మలన్నీ యోగాగ్నిచేత దగ్ధంచేయబడుతాయి కనుక యితడు సకల దోహవిముక్తుడై నిర్మలుడై భాసిస్తాడు. అప్పుడతడు బ్రహ్మములో లీనమై నీరు నీరులో కలిసినట్లు, నిప్పు నిప్పులో కలసినట్లు ఆ పరబ్రహ్మతత్త్వములో మమేకమై అందులో ఐక్యమైపోతాడు – అని స్వామి అలర్కునికి యోగియొక్క స్థితులు వివరించారు.

సుమతి తండ్రితో యిలా అన్నాడు – “తండ్రీ! అలర్కుడు శ్రీ దత్తునికి నమస్కరించి “స్వామీ! బ్రహ్మమార్గంలో పయనించే యోగిచర్యలు ఎలా వుంటాయి? దయచేసి తెలియజేయండి” అని వేడుకొన్నాడు. అప్పుడు స్వామి యిలా చెప్పసాగారు.

అలర్క మహారాజా! యోగి ప్రవర్తన సామన్య మానవుని ప్రవర్తనకంటే భిన్నంగా వుంటుంది. సాధారణ మానవులందరూ మానావమానములకు ఎంతగానో ప్రభావితులౌతారు. తమకు గౌరవ, ఆదరములు కలిగినప్పుడెంతో పొంగిపోవటం, అవమానం, నిరాదరణ కలిగినపుడు క్రుంగిపోవడం వారి లక్షణం. కానీ యోగి అలాకాదు. ఎవరైనా తనను గౌరవించటం, కీర్తించటం చేస్తే అతడు ఆ గౌరవాలను విషతుల్యంగా భావిస్తాడు. అవమానిస్తే ఎంతో సంతోషిస్తాడు. ఎందుకంటే అతడు జనుల అభిమానం పొందగోరక తన యోగసాధనలో వున్నతమైన స్థితిని పొందే యత్నంలో వుంటాడు గనుక జనుల ప్రలోభాలు అతడికి విషతుల్యంగా వుంటాయి. యోగి పవిత్రమైన ప్రదేశాలలోనే సంచరిస్తాడు. పవిత్రమైన ఆహారము, జలము మాత్రమే స్వీకరిస్తాడు. ఎల్లప్పుడూ సత్యమునే పలుకుతాడు. నిర్దుష్టమైన ప్రవర్తన కలిగివుంటాడు. నియమనిష్టుడై వుంటాడు. ముఖ్యంగా యోగము సిద్ధించగోరు యోగి శ్రాద్ధ భోజనము చేయకూడదు. ఎవరి యింటిలోనూ ఆతిధ్యం స్వీకరించకూడదు. యజ్ఞ ధర్మానికి వెళ్ళకూడదు. తీర్ధయాత్రలకు, వుత్సవములు చూచుటకు వెళ్ళకూడదు. ఎక్కువగా జనసమ్మర్ధము వున్నచోటికి అతడు వెళ్ళకూడదు. అంతేకాదు, అతడు భిక్ష కూడా అందరి యిండ్లలో తీసుకొనకూడదు. వేదవేదాంగపారంగతులైన వారి యిండ్లకు, దాతృత్వము కలిగి శ్రద్ధతో భిక్షనొసగే వారి యిండ్లలో మాత్రమే భిక్ష స్వీకరించాలి. యోగికి బియ్యపు జావ, యవల జావ, పేలపిండి, తెలికపిండి, పెరుగు, పాలు, పండ్లు, కందమూలములు, నూకల అన్నము, యోగసిద్ధికరమగు శుభాహారములు. ఆహారం స్వీకరించే ముందు యోగి కొంతసేపు మౌనంగా కూర్చొని ఆ తరువాత ముందుగా కొంచెం నీరు పుచ్చుకొని, పంచప్రాణాహుతులు వేసుకొని అప్పుడు భోజనం చేయాలి. భుజించిన తర్వాత మళ్ళీ మంచినీరు త్రాగి లేచి, కాళ్ళు చేతులు కడుగుకొని పరిశుద్ధుడై మరలా కొంచెము ఆచమనం చేసుకొని అప్పుడు తన చేతితో తన హృదయాన్ని తాకాలి. అస్తేయము, బ్రహ్మచర్యము, త్యాగము, అలోభము, అన్నింటికంటే ముఖ్యం – అహింస. ఈ ఐదు లక్షణాలు యోగి తన వ్రతములుగా స్వీకరించాలి. ఇంకా అక్రోధము (కోపము లేకుండటం), శౌచము (శుచిగా వుండటం), లఘ్యాహారము (మితముగా ఆహారం స్వీకరించడం), గురుశుశ్రూష, నిత్య స్వాధ్యాయము – ఈ ఐదు నియమములు కూడా యోగి తప్పనిసరిగా ఆచరించాలి. లోకంలో అనేక విషయాలను గురించిన ఎన్నో శాస్త్రాలుంటాయి. అయితే వాటన్నింటినీ తెలుసుకొనాలని, వాటి గురించిన పరిజ్ఞానాన్ని సంపాదించాలని ఆరాటపడకూడదు. కేవలం ముక్తిసాధనముకుపయోగపడే జ్ఞానాన్నే సముపార్జించుకొనే యత్నములోనే యోగి వుండాలి. అప్పుడే అతడు మోక్షసిద్ధిని సాధించగలడు. అలాకాక యోగి జ్ఞానతృష్ణకు అంటే యితర విషయ పరిజ్ఞానమునకై వ్యామోహపడితే అతడింక వేయికల్పాలకు కూడా గట్టెక్కలేడు. ముక్తిని సాధించలేడు. కనుక అతడు యీ విషయమై అప్రమత్తుడై వుండాలి.

**– సశేషం**

# కోతిబుద్ధి - సమాజశ్రేయస్సు

పి. వాట్సన్

సాటి మానవులతో– ఒక పరిశీలించాల్సిన విషయం. మనం అనేక పరిస్థితులలో, ఉద్యోగాలలో, వివిధ ప్రాంతాలలో ఉంటున్నా ఒకరితోఒకరం సంబంధం కలిగే ఉన్నాం. ఏ ప్రాంతంలో ఏం జరిగినా, ఎవ్వరి గురించైనా మనకు తెలుసుకోవాలనే వుంటుంది. వారు మన తోటివారేనన్న లోనున్న సహభావమే మన ఆసక్తిగా ప్రకటమౌతుంది. ఎక్కడ ఏ చెడు జరిగినా 'అయ్యో' అనిపించి, దానికి కారణమైన పరిస్థితులు, సమాజము, ప్రభుత్వము, సంబంధిత వ్యక్తుల మీద కోపం వరకు వచ్చి , పక్కవారితో కాసేపు మాట్లాడి వదిలేయటం జరుగుతుంది. అంతకు మించి ఏమీ చేయలేము కనుక అక్కడితో మన బాధ్యత తీరిపోతుంది. నిజంగా ఆలోచిస్తే ఎవరో ఏదో చేయాలి, అది మన పని కాదన్న భావం, బద్ధకం, అదే ప్రమాదం మన కుటుంబానికి జరిగితే ఎలా అన్న భయాన్ని కూడా మింగివేస్తుంది. మళ్ళీ మామూలుగా, చిన్ని నా పొట్టకు శ్రీరామ రక్షగా ఉద్యోగము, అన్ని బాధ్యతలు మరచిపోవటానికే అన్నట్లు సినిమా, టి.వి., ఉన్న కాస్త ఓపికా వదలటానికి గంటల తరపడి పిచ్చాపాటితో రోజు గడిచిపోతుంది. మంచి తోటలో జొరబడి దొరికినవి తింటూ, మిగతావి పాడుచేస్తూ, కిచకిచమని గోల చేస్తూ, తోట పాడు చేసే పిచ్చి కోతి బుద్ధికీ దీనికీ తేడా ఏముంది?

అలా కాక, కాస్త ఆలోచించి, పది మందికీ మంచి జరగాలి అని పనిచేసే వారు social workers. ఒక సమాజాన్ని అర్థం చేసుకొని ఆ పరిధిలో సేవా సంస్కరణలు చేసిన వారు మార్క్స్, గాంధీ వంటి వారు. మొత్తం సృష్టి ఎలా నడుస్తున్నదో అనుభవ పూర్వకంగా అర్థం చేసుకొని ప్రస్తుత, రాబోయే, పరిణామాల పట్ల ఖచ్చితమైన అవగాహన కలిగి, సర్వమానవాళికి ఉపయోగ పడే రీతిన జీవితాలని నడిపిన వారే మొహమ్మద్, జీసస్, సాయినాధుని వంటి మహాత్ములు.

ఒక పది మందికి పనికి వచ్చేపని చేయాలంటే ఎంత కష్టపడాలో చూస్తే, అవిస్రాంతంగా సేవ చేసిన మదర్ థెరీసా లాంటి వ్యక్తుల శ్రమ, అందరికీ ఉపయోగపడేలా విశేషమైన జీవనమార్గాన్ని ఏర్పరచిన మహాత్ముల శ్రమ ఎంతటిదో అర్థమవుతుంది.

మామూలుగా కార్పొరేట్ ఉద్యోగమో, లాభసాటి వ్యాపారమో చేస్తూ ఒక రాజకీయ శక్తి పట్ల అభిమానంతో రోజు గడుపుతూ, సినిమా కబుర్లతో రుచికరమైన భోజనం చేసి, అటుగా వచ్చిన పండుగలో గంతులు వేసి, వినాయకుణ్ణి నీళ్ళలో తోసి, మిగతా డబ్బు లైఫ్ ఇన్స్యూరెన్స్‌లో వేసే కోతులు కారు వారు. ఆహారము, ఆరోగ్యము, ధనము, కుటుంబము పణంగా పెట్టి రాత్రి పగలు సృష్టిని అర్థం చేసుకోవాలి, ఇతరులకు తిరుగు లేని సేవా మార్గాన్ని ఏర్పరచాలి, తద్వారా సర్వజీవులూ సుఖంగా ఉండాలి అని తీవ్ర కృషి చేసిన నిజమైన మనుషులు వారు.

అటువంటి వారే పూజ్య గురుదేవులు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరు గారు. వారి పవిత్రమైన పాదపద్మములకు నా సాటి వారైన మీ తరపున నమస్కారములు.

తను ఎంతగానో అభిమానించిన చిన్న పిల్లవాడి మరణంతో కలిగిన విపరీతమైన బాధలో అతని తల్లిదండ్రులైన తన అన్న వదినగార్ల దు:ఖాన్ని పోగొట్టాలన్న భావనతో మొదలైంది ఆయన అసలు జీవితం. చిన్న తనం నుండి భయము, దు:ఖము ఎరుగని ఆయనకు, ఈ సంఘటన ఆయన వ్యక్తిత్వాన్ని, సమాజానికి ఆయన అవసరాన్ని గుర్తించిన ప్రకృతి, తన గోడు వినటానికి తిరస్కరించలేని ఆహ్వానాన్ని పంపినట్లైంది. అలా ప్రకృతి తత్వాన్ని అర్థం చేసుకోవడంలో ఆయన 5 సంవత్సరాల నిరంతర కృషి, ప్రతి క్షణం సత్యానికి మాత్రమే విలువనిస్తూ, అన్వేషణకి అవసరమైతే విషాన్ని కూడా రుచి చూడాలనుకున్న ఆయన పంథా, 'ఎంతటి గొప్పవారికి తట్టిన విషయమైనా అంతగా ఆలోచిస్తే ఎవరికైనా తట్టి తీరాలి' అన్న తిరుగులేని ఆత్మస్థైర్యం మీద నిలబడి సాగింది. ఒక రోజు ఆయన నిజాయితీకి, కృషికీ ప్రకృతి తన నిజస్వరూపాన్ని ఆయన హృదయగతం చేసింది. ఆయన అన్వేషణ ఫలించింది.

'సాధించేవరకూ ఏదీ చెప్పకు, సాధించిన తర్వాత ఎవరినీ మరువకు' అన్న ఆయన జీవితంలో ఇక మానవోద్ధరణ మొదలైంది. తన చిన్నన్నగారికి తోడుగా మాత్రమే శిరిడీ వెళ్ళిన మాస్టరుగారికి సాయినాధులు, తను ఇదివరకే సాధించిన సత్యానికి ' సృష్టి మొత్తం సంకల్పమాత్రంగా తనలో వుండి తనచే నడుపబడుతున్నది' అన్న అనుభవరూపమిచ్చారు. పూర్ణత చెందిన మహాత్ములు ఆ స్థితిలో సృష్టితో తాదాత్మ్యం

చెంది ఉంటారని ఆయనకు ఆయన స్థితి తెలిసింది. అక్కడనుంచి మాస్టరుగారు సమాజానికి సాయినాధుని లాంటి మహాత్ముల అవసరాన్ని తెలియజేశారు. అసలు మహాత్ములు ఎందుకు వస్తారు, వారేమి చెప్పదల్చుకున్నారు, అది వారెలా ఆచరించి చూపుతారు, దాని ద్వారా మనమేమి నేర్చుకొని చక్కని సమాజాన్ని నడుపుకోవచ్చు వంటి అతి ముఖ్యమైన విషయాలను తెలియజేశారు.

ప్రకృతి తత్వాన్ని , సృష్టి క్రియను నిజంగా అర్థం చేసుకున్న వారే–మహాత్ములే, దానిని ఇతరులకు చెప్పటానికి అర్హులు. వారే దానిని ఉపయోగపడే రీతిన ఎవరెవరు ఎలా నడుచుకోవాలో చెప్పగలరు. ఇతరులు అటువంటి ప్రయత్నం చేయడం తాము ఊబిలోవుండి ఊబిలోపడ్డ ప్రక్కవాడిని రక్షించటానికి ప్రయత్నించినట్లే. అది నటనే. కాసేపు ఒకరిని ఒకరు పొగుడుకున్నా, ఇద్దరూ మునిగేవారే . నిజమయిన మహాత్ములే ఆశ్రయించ దగిన వారు, అనుసరించదగిన వారు అన్న ముఖ్యసూత్రాన్ని మాస్టరు గారు తెలియ జేశారు. దానికి ఆలంబనగా ఎంతో శ్రమించి ఎందరో మహాత్ముల చరిత్రలు వ్రాశారు. 18 సంవత్సరాలు కష్టపడి సాయిబాబా జీవిత చరిత్ర రాశారు. ఆ చరిత్రలు చదివితే మనకు మహాత్ముల సాన్నిధ్యం అనుభవమై మంచి మార్గంలో పయనిస్తామని అంటారాయన. దీనంతటినీ scientificగా తిరుగులేని రీతిన వివరించి సందేహాలన్నీ తీరేలా 'ఏది నిజం', 'విజ్ఞాన వీచికలు' పుస్తకాలు వ్రాశారు. ' ప్రతి ఒక్కరు ముక్తిపథానికి వెళ్ళే వంతెనలా నేను ఉపయోగ పడితే చాలు, చివరి వాడు నన్ను తనతో తీసుకువెళితే చాలు' అంటారాయన.

ఇప్పుడు మన మొదటి కర్తవ్యం ఏమిటీ? పొట్ట, నడుము పెంచి ఒక గంట కూడా నిలబడలేని స్థితిలో ధర్మము, నిజాయితీల గురించి మాట్లాడి వదిలేయడమా ? ఒక సినిమా హీరో గురించి, అతని పిల్లల జీవితం గురించినంతగా కూడా బాబా గురించి తెలుసుకోకుండా, నేను బాబా భక్తుడిని ప్రతివారం గుడికి వెళతానని తృప్తి చెందడమా? అలా కాక, మాస్టరు గారు రచించిన గ్రంథాలు చదివి, విషయాలు తెలుసుకొని, సాధ్యమైనంత ఆచరించటానికి ఒక్క అడుగు వేస్తే, తర్వాత ఏం చేసినా భరిస్తూ వారే మనను ముందుకు నడిపిస్తారు. వారి సిద్ధాంతము మనను వెన్నుపూసలా నిలబెడుతూ వుంటుంది. సమాజంలో చెడుకు కారణమైన లక్షణాలు లేని వ్యక్తిని ఊహించండి. ఆశ, భయము, పిరికితనము, కోపము, మోసమూ, ఆడంబరమూ, చపలచిత్తమూ, అహంకారమూ, రాగము, ద్వేషము, అసూయ లేని వ్యక్తిని ఊహించండి. వారే మహాత్ములు. అటువంటి వ్యక్తిత్వం కలవారే అమ్మగారు. వారి ద్వారానే సమాజశ్రేయస్సు జరుగుతుంది. మాస్టరుగారు చెప్పినట్లు పరిపూర్ణ మహాత్ముల దర్శన ఆశీస్సులు, వారిని అనుసరించటము ప్రధానము. మంచితనము అక్కడనించే మొదలౌతుంది.

కనుక అమ్మగారిని దర్శించి, వారి జీవితాన్ని, గొప్పతనాన్ని, అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం, వారు చెప్పింది ఇప్పటికైనా యోచిద్దాం, ఎప్పటికైనా ప్రయత్నం చేద్దాం. ఎవరేం చెప్పినా వినకుండా మొద్దుబారిపోయిన మన మనస్సులను సరియైన ఆలోచనా, సత్యాన్వేషణలతో ఉత్తేజపరుద్దాము. తద్వారా సమాజశ్రేయస్సుకు పాటుపడదాము. రాబోయే ' ఏది నిజం?' క్లాసులలో కలుసుకుందాం.

## ఆచార్య బోధ

సరిగా వికసించిన మానవత్వనైజంలోని ప్రధానాంశం జిజ్ఞాస-ఆకాశంలో వెల్గే సూర్యుడు, చంద్రుడు, చుక్కలు - యివన్నీ ఏమిటి? ఎలా వచ్చాయి? ప్రకృతిలోని వస్తువులు, జీవులు - అన్నీ ఎలా వచ్చాయి? యిటువంటి ప్రశ్నలన్నీ తలెత్తటం మానవనైజం. ఇంకాంచెమెదిగాక సుఖదు:ఖాలు, జీవన్మరణాలు - ఎలా ఎందుకు కలుగుతాయి? జీవితానికీ, సృష్టికీ గమ్యమేమిటి? సర్వజీవులు సుఖంగా మనేదెలా? అన్న ప్రశ్నలు సహజంగా హృదయంలో ఉత్పన్నమవుతాయి. ఈ ప్రశ్నలకు సమాధానంకోసం అన్వేషించడమే జీవిత లక్ష్యమవుతుంది. అలా అయితేనే మనలో మానవత్వం వికసిస్తున్నట్లు గుర్తు. మిగిలిన ప్రాకృతిక జీవితమంతా ఒకవంక ప్రేమతో సాటివారి హితంకోసం, మరొకవంక సత్యాన్వేషణకోసం ప్రయత్నించాలి. అంతేకాక సాటివారిపట్ల మన మనోభావాలను నిశితంగా పరిశీలించుకోవాలి. యాంత్రికంగా నేటి సమాజంనుండి మనం నేర్చుకున్న విలువలను సృష్టి-ప్రకృతి-మానవజీవితాల తత్త్వాల దృష్ట్యా పరిశీలిస్తే, అవి ఎండమావులలా, సూర్యుని వెలుగుముందు మంచుతెరలలా వీడిపోతాయి. మన హృదయమనే పలకమీద మనం వ్రాసుకున్న పిచ్చిగీతలను చెరుపుకుని సర్వాంగ సుందరమైన అక్షరపంక్తిని వ్రాసుకోవచ్చు. అలా జరిగిన ఆరోజున అలనాటి ఋషులయుగం ఈ క్షణంలో యిక్కడనే వున్నది. అలా జరగనంతవరకు మనకు సంబంధించినంతవరకు అది ఎప్పుడూ ఎక్కడాలేదు.

**- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# శుద్ధతత్వజ్ఞానానికి ప్రతిరూపమే మాస్టర్‌గారు

కే.ఎస్.శ్యాం ప్రసాద్

శుద్ధతత్వజ్ఞానానికి ప్రతిరూపమే మాస్టర్‌గారు. ప్రతి ఒక్కరూ ఏదోఒక సిద్ధాంతాన్ని అనుసరించే వారే, 'ఆలోచించకుండా' ! అదే మనకు, మాస్టర్‌గారికి వున్న తేడా! వారు సిద్ధాంతాన్ని కూలంకషంగా పరిశీలించిన తర్వాతనే త్రికరణ శుద్ధిగా నమ్మి ఆచరించేవారు, బాహ్య పరిస్థితులు అనుకూలించినా, ప్రతికూలించినా చలించేవారుకాదు. అదే మనమైతే మనల్ని పొగిడినంతసేపు, సమర్ధించినంతకాలం ఎలాంటి వాళ్ళకైనా తొత్తులయ్యేందుకు వెనుకాడం! వారు తన వుద్యోగం, ఆర్థిక పరిస్థితులు తలక్రిందైనా 'నా సాయి నాకున్నాడు' అన్న మహనీయుడు. ఎన్నో నిదర్శనాలు, అనుభవాలు కల్గిన తర్వాతనే సాయిని ఎన్నుకొన్నారు మాస్టర్‌గారు. సాయిని ఎన్నుకున్న తర్వాత తత్వవిచారం ఎప్పుడూ మాస్టర్‌గారు చెప్పలా! తత్వచింతన పెరిగిన కొద్దీ సాయిపై భక్తి స్థిరంగా నిలుస్తుందన్నారు మాస్టర్‌గారు. సాయి భక్తులు కాని వారు మొదట 'ఏదినిజం?' 'మతం ఎందుకు?' చదివితే దైవం వున్నారన్న నమ్మకం కల్గి ఆ తర్వాత నెమ్మదిగా సాయిభక్తులవుతారు గాని, మేము ముందునుంచే సాయి భక్తులం కాబట్టి పైపుస్తకాలు చదవక్కర్లేదన్న భక్తులతో ఒకసారి "సాయి పై భక్తి మనకు లాభమైన పనులు నెరవేరినప్పుడే పెరుగుతూ కష్టమైన , ఇష్టంలేని పనులు జరిగితే చలిస్తూ వుంటుంది. తత్వచింతన వల్ల ఏది మంచిదో అదే సాయి మనకు చేస్తాడు అనే ధైర్యంతో సాయిని ఆరాధిస్తాడు " అని మాస్టర్‌గారు అన్నారు. నిశ్చలతత్వమే జీవన్ముక్తి! అని శాస్త్రం ! మనలో వున్న అజ్ఞాన భావాల్ని తత్వ చింతనతో తొలగించుకోవల్సిందే తప్ప వాటంతటవి పోయేవికావు. సిమెంటు గోతాం విదిలించే కొద్దీ సిమెంటు రాల్తూనే వుంటుంది. సిమెంటు గోతాం విదిలించినట్లు మన మనస్సును అనేక కోర్కెల నుంచి విదిలిస్తే తప్ప మలిన వాసనలు పోవు " అన్నారు మాస్టర్ గారు . ఈ జగత్తు భ్రాంతి మయం అనెప్పుడూ తీవ్ర ముముక్షువుకు వుంటుంది. అదే సాధుజ్యోతికి ప్రతి వస్తువు విలువైనదిగా తోస్తుందికాబట్టి సంగ్రహిస్తూంటాడు. సాధకుడే అన్నిట్లో (ఒకే భగవతత్వాన్ని) సాయినే దర్శిస్తాడు కాబట్టి ఆ స్వామికి శరణాగతి చెందుతాడు. మనం శరణాగతి చెందామా? లేదా? అనేది మన మనస్సు పై మనకున్న ఆధిపత్యాన్ని బట్టి తెలుస్తుంది. మనలో ఎన్నో కాంక్షలు, ఆకాంక్షలు పుట్టుకొస్తూ అతలాకుతలం చేస్తుంటే ఇంక శరణాగతేమిటీ, స్మరణమేమిటీ, నామజపమేమిటి,పారాయణమేమిటీ, ప్రదక్షణమేమిటీ. అన్ని వాటి చుట్టునే తిరుగుతూ మనల్ని తిప్పుతుంటాయి. కాబట్టి గురుకృప లేక మనమేం చేయలేం! మాస్టర్ గారు చెప్పినట్లు 'ఏది నిజం?'అనేది తెల్సుకొని 'నిజానికినిచ్చెన' వేసిన తర్వాతనే 'విజ్ఞాన వీచికలు' మన మనస్సును ఆహ్లాదపరిస్తూంటే అప్పుడే 'సాయి లీలామృతం' పానం చేసి 'సాయి సన్నిధి' చేరుతాం! .............

## "సాయిబాబా" పాఠకులకు విజ్ఞప్తి

మీ ''సాయిబాబా''లో ''ద్వారకామాయి అనుభవమంటపం" పున: ప్రారంభం!!! శ్రీ సాయినాధుని, శ్రీ సాయి మాస్టర్ కృపవలన, పారాయణ ఫలితంగానూ మీకు కలిగిన అనుభవాలను మీరు మాకు పంపిస్తే "ద్వారకామాయి అనుభవమంటపం" అనే శీర్షిక క్రింద నెలకు ఒకరి అనుభవం ప్రచురించబడుతుంది. మీరు అనుభవాలు పంపవలసిన చిరునామా –

" Editor, Sai Baba Monthly Magazine,
Sri Master Universal Sai Trust, M.M.Donka,
Ongole - 523 002 "

– "సాయిబాబా"

“ద్వారకామాయి అనుభవమంటపం”

# ఇది కేవలం శ్రీ మాస్టరుగారి కృప

గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణు: గురుదేవో మహేశ్వర:
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమ:

అది 1988వ సంవత్సరం నవంబరు 23వ తారీఖు. సమయం రాత్రి 7 గంటలు ప్రాంతంలో పూజ్యశ్రీ మాస్టరు గారు మా నాన్న గారితో బాటు ఇతర భక్తులతో మా ఇంటి gate లోంచి లోపలికి వస్తుంటే మా అందరి ఆశ్చర్యానందాలకు అంతేలేదు. వాకిట్లోకి వస్తూనే “ఎన్నాళ్ళకి ఎన్నాళ్ళకి” అంటూ మా అమ్మకేసి చూస్తూ ముఖమంతా నవ్వుతో లోపలకి వస్తున్నారు పూజ్యశ్రీ మాస్టరు గారు. మా అమ్మ ఎంతో ఆనందంతో చేతులు జోడించి నమస్కరిస్తూ ఎదురుగా వెళ్లి “రండి రండి” అని స్వాగతం పలికింది. మా అమ్మ ఆనందానికి అంతులేదు. పూజ్యశ్రీ మాస్టరుగారంటే మా అమ్మకి ఎంతో భక్తి, ప్రీతి. లోపలకొచ్చి కుర్చీలో కూర్చున్నారు శ్రీ మాస్టరుగారు. అప్పుడు అందరమూ అంటే అమ్మ, నాన్న , ఇద్దరు చెల్లెళ్ళు, నేను పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారము చేసుకున్నాము. అప్పుడు కూడా వచ్చిన భక్తులకు ఒకటే ఆశ్చర్యం వారి రాక మాకు తెలీదనేసరికి. ఎందుకంటే పూజ్యశ్రీ మాస్టరుగారిని వాళ్ళ వాళ్ళ యిళ్లకు ఆహ్వానిస్తూ ఎందరో భక్తులు ఎప్పటినించో wait చేస్తున్నారట. శ్రీ మాస్టరుగారు మా నాన్నగారి office కి ఫోన్ చేయించి వారున్న చోటుకి రప్పించుకొని ఎవరో భక్తుల కారులో మా ఇంటికి వచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారితో మా అమ్మ, నాన్నగార్లు సంభాషిస్తుంటే నేను పూజ్యశ్రీ మాస్టరు గారికి కాఫీ చేసాను. వారికి కాఫీ సమర్పించుకునే అవకాశం అలా దొరికింది. వారు ఎంతో దయతో కాఫీ తీస్కున్నారు. తర్వాత అడుగున కొద్దిగా మిగిలింది. మేము ఐదుగురమూ ప్రసాదంగా తీసుకున్నాము. సుమారు అరగంట వుండి ఇంక బయలుదేరుతూ మా అందరికీ విభూతి స్వయంగా నుదిటి మీద పెట్టి, చేతులో ప్రసాదంగా ఇచ్చారు.

ఆ రోజు రాత్రి శ్రీ మాస్టరుగారు బయలుదేరాక అందరమూ అవే విషయాలు ఆనందంతో చర్చించుకుంటున్నాము. ఇంతలో రెండు రోజుల నుండి నాకు జ్వరంగా ఉండడంతో tablet ఒకటి వేస్కున్నాను. అది కాస్తా గొంతులో అడ్డం పడి రాత్రంతా నానా యాతన పడ్డాను. మా అందరికీ ఆశ్చర్యం వేసింది. పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం లభించిన గొప్ప రోజు ఏదైనా చెడుంటే తొలగిపోవాలి గాని ఇలా అయ్యిందేమిటా అని. అయితే ఆ incident నా భావి జీవితంలో పొంచి వున్న ప్రమాదానికి ఒక సూచన అని అప్పుడు తెలియలేదు. 1994 మే నెలలో నాకు severeగా కడుపునెప్పి రావడంతో emergency operation చేసారు. కాని operation లో చిన్న పొరపాటు వల్ల 24 గంటలలో మళ్ళీ అంతా operation repeat చేయాల్సివచ్చింది. Second time operation అప్పుడు మత్తుమందు dose ఎక్కువై operation అయిన చాలా సేపటివరకు నాకు స్పృహ రాలేదు సరికదా చాలా complications create అయ్యాయి. చివరికి NIMSలో చేర్చారు. Ventilators మీద Respiratory Intensive Care Unit (RICU) లో 10 రోజుల పాటు వుండి ప్రాణాలతో బయటపడ్డ ఏకైక patient ని. అప్పుడు గొంతులోకి tube అమర్చారు. ముక్కులోంచి ఏదో wires పెట్టారు. గొంతు మూసుకుపోయేలా press చేసి పడేసిందా

tube. అప్పుడు గుర్తొచ్చింది నాకు పూజ్యశ్రీ మాస్టరు గారు వచ్చినప్పుడు నాకు గొంతులో అడ్డం పడినది నేను నరకయాతన పడిన రోజు – అలా నాకు ప్రాణ గండం వుంటే మళ్ళీ నాకు ప్రాణ దానం చేసారు. నా life extend చేసారు. అంతేగాదు పూర్తి ఆరోగ్యాన్ని ప్రసాదించారు. ఇది కేవలం శ్రీ మాస్టరుగారి కృప.

ఐతే ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నాకు ప్రాణదానం చేసారు వారి కృప నా మీద ఉంది అని ఆనందంతో అందరమూ పరవశించామే తప్ప కనీసం ఇకనైనా ఈ extended life ని సార్ధకం చేసుకోవాలని, ఎట్లా గడిపితే జీవితం సార్ధకం అవుతుంది అన్న ఆలోచన కొద్దిగా కూడా లేదు. వాటంతట మనకి ఏట్లా వస్తాయి అటువంటి ఆలోచనలు–వారు సంకల్పిస్తే తప్ప.

సరిగ్గా అటువంటి ఆలోచనలు రేకెత్తించేలా నా జీవితం మలుపు తిరిగింది. 1997 ఏప్రియల్ 8న ఉగాది పండుగ నాడు మాకు బాబు పుట్టాడు. పుడుతూనే రెండవ రోజు fits వచ్చాయి. ఆరు నెలల తరువాత ఒక రాత్రి high temperature తో జ్వరం వచ్చింది. రాత్రంతా జ్వరంతో మూలుగుతూనే ఉ న్నాడు బాబు. తెల్లారి డాక్టర్ దగ్గరకెళితే వాళ్ళు చాలా shocking news చెప్పారు. ఆ high temperature వల్ల వాడి brain effect అయ్యిందని, మొత్తం central nervous system అంతా damage అయ్యిందని, ఇక ఏమి చేయలేము అని, అప్పటినుంచి వాడిలో ఎటువంటి improvement లేదు. నిల్చోలేడు, నడవలేడు, మాట్లాడలేడు, మెలుకువగా ఉన్నంత సేపు ఏడుస్తూ వుంటాడు. యీ చేదు నిజాన్ని భరించటం చాలా కష్టమైంది. కాని తప్పదు. face చెయ్యాలి కదా. ఎన్ని testలు చేయించామో , ఎందరు doctorల చుట్టూ తిరిగామో. మా దైనందిన జీవితమంతా అస్తవ్యస్తమైంది. వాడు రాత్రంతా మెలుకువగా వుంటాడు. ఏ తెల్లవారు ఝామునో కునుకు తీస్తాడు. నిద్ర ఆపుకోడం చాలా కష్టం అయ్యేది. మళ్ళీ పొద్దున్న officeకి వెళ్ళాలి. అప్పటికీ కొన్నాళ్ళు సెలవు పెట్టాను నేను. చాలా గంభీరమైన సమస్య మేము face చేస్తున్నాము. మా ప్రయత్నమంతా మేము చేసాము. చూపవలసిన doctorకి చూపాము, చేయవలసిన testలు అన్నీ చేయించాము. ఈ కష్ట సమయంలో మా అమ్మ నాన్న, ఇద్దరు చెల్లెళ్ళు ఎంతో అండగా నిలిచారు. భగవంతుడు వీరి రూపంలో మాకు చేయూతనిచ్చాడు. లేకపోతే ఏమై పోయేవాళ్ళమో!!

ఇక భగవంతుడు తప్ప ఈ విషయంలో ఎవరు ఏమి చేయలేరని నిర్ధారణ కొచ్చి officeకి రెండు నెలలు సెలవు పెట్టి 3 సార్లు శ్రీ గురు చరిత్ర, 4 సార్లు శ్రీ సాయి లీలామృతం సప్తాహ పారాయణలు చేసాను. చాలా దీక్షగా. అప్పుడు నాకొక కల వచ్చింది.

'అది మిట్టమధ్యాహ్నం. వేసవి కాలంలా వుంది. నేనొక మట్టి రోడ్డు వెంబడి పోతున్నాను. రోడ్డుకిరువైపులా ఇళ్ళున్నాయి. రోడ్డు నిర్మానుష్యంగా వుంది, నడుస్తున్నదాన్నల్లా suddenగా నా కుడి వైపుకు తిరిగి ఒక ఇంటి వైపు చూసాను. ఆ ఇంటి main doors first half ఇనుప చువ్వలున్నాయి. అందులోంచి పూజ్యశ్రీ మాస్టరుగారు చెయ్యి బయటకి పెట్టి నన్ను లోపలకు రమ్మని సైగ చేస్తారు. నాకు పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడగానే చాలా ఆశ్చర్యం వేస్తుంది ఇక్కడున్నారేమిటా అని. ఆనందంతో మెట్లు ఎక్కి ఇంట్లోకి వెళతాను. ఆ రూము చాలా చిన్నగా వుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు నా కోసం చూస్తున్నారు. ఒక గోడకి ఆనుకొని నిలుచుని వున్నారు. White బనీను, blue గళ్ల లుంగీ కట్టుకుని వున్నారు. పూజ్యశ్రీ మాస్టరు గారిని అంత దగ్గరగా చూసేసరికి నాకు ఒక్కసారిగా దు:ఖం ఉప్పెనలా

ముంచుకొచ్చింది. బాగా ఏడ్చేస్తానట. నా రెండు చేతుల్లో నా ముఖం మూసుకుని ఏడుస్తూ మా బాబు ఆరోగ్యం గురించి, (అదే సమయంలో మా పెద్ద చెల్లెలు పెళ్ళి అయ్యాక చాలా severe problem ఒకటి face చేస్తుంది) తన సమస్య గురించి చెబుతాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరు గారు అంతా విని "తొమ్మిది" అంటారు. నాకేమి అర్థం కాలేదు. అయితే ఏమిటో కాని అప్పటికే నా మనస్సు బాగా స్థిమితపడింది. మనస్సంతా చాలా కాలానికి హాయిగా అన్పించ సాగింది. ఇంతలో పూజ్యశ్రీ మాస్టరు గారు లోపలి గది వైపు చూపుతూ వేలుతో చూపిస్తున్నారు. ఒక క్షణము ఏమీ అర్థం కాలేదు. ఆ రూము వైపు వెళ్ల మంటున్నారు కాబోలనుకొని సంకోచంగా, భయం భయంగా అటు వెళతాను. నేను బయట ఎండలో నుంచి లోపలికి వచ్చాను గదా, ఈ రూము ఇంకా లోపల వుండడంతో ఆ రూము లోపల, ముందు అంతా చీకటిగా అనిపిస్తుంది. ఇంకా పరికించి చూడగా తెల్లచీర కట్టుకుని golden border అనుకుంటా పూజ్యశ్రీ అమ్మగారు green cane కుర్చీలో కూర్చుని కనిపించారు. వారి వెనకగా రెండు పక్కలా ఇద్దరు చాలా పొడవుగా వున్న ఆడవాళ్లు నిలుచుని వున్నారు. నాకేమి చేయాలో తోచలేదు. లోపలికి వెళతాను . పూజ్యశ్రీ అమ్మగారు నా వైపు ఎటువంటి expression లేకుండా చూస్తున్నారు. ఇంతలో కల అయిపోయింది.

అంటే పూజ్యశ్రీ అమ్మగారి పాదాలను ఆశ్రయించాలని స్వయంగా పూజ్యశ్రీ మాస్టరుగారే నాకు ఆదేశించారనిపించింది.

ఐతే పూజ్యశ్రీ అమ్మగారి గురించి నాకు ఎక్కువగా ఏమీ తెలీదు. వారి దగ్గర ఇలా సేవకులు వుంటారని కూడా తెలీదు. 1991లో ప్రధమంగా ఒంగోలులో వారిని దర్శించుకున్నాను.

నాకీ కల వచ్చింది 1997లో కదా! చాలా తమాషాగా పరిస్థితులు ఎలా కలిసి వచ్చాయో! పూజ్యశ్రీ అమ్మగారు Hyderabad తరలి రావడం అటు తర్వాత 2004లో Malkajgiri రావడం, అదే buildingలో మేంవుండడము, Nov 2005 నుండి Sept 2006 వరకు వారికి ప్రత్యక్షంగా సేవ చేసుకునే మహద్భాగ్యాన్ని వారు ప్రసాదించడం, నేను వారి సేవలో వున్నప్పుడు ఒకరోజు పూజ్యశ్రీ అమ్మగారు చాలా మాములుగా "ఇప్పుడు బాబు వయస్సు ఎంత అని అడిగారు. వాడికి అప్పుడు సరిగ్గా తొమ్మిది సంవత్సరాలు. జవాబు చెప్తుంటే నాకు వెంటనే ఆ కల గుర్తొచ్చింది.

ఇప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నాగోలు వచ్చేయడం, ఎందరో భక్తులతో పాటు మమ్మల్నికూడా తీసుకువచ్చి వారి నిలయం దగ్గరే ఇల్లు కట్టుకునేలా ప్రేరణ యిచ్చి మాకు వారి పాదాల దగ్గర చోటు ప్రసాదించారు. ఇంతకంటే జీవితంలో ఇంకేమి కావాలి?

ఇప్పుడు నిరంతరం మా అందరి ప్రార్ధన ఒక్కటే... మా జీవిత శేషమంతా వారి దివ్య పాదాలకు త్రికరణ శుద్ధిగా సేవించుకునేలా అనుగ్రహించమని, వారి సన్నిధి, సేవా, సాంగత్యాలు, ఎప్పటికీ ప్రసాదించమనీ, మహత్తరమైన వారి సన్నిధిని మేము సద్వినియోగ పరుచుకునేలా వారే రక్షించి మమ్మల్ని కాపాడాలనీ వేడుకుంటూ.....

బీ. విజయ లక్ష్మి

# విజ్ఞాన వీచికలు – ఈ గ్రంథం నాస్తిక వాదానికో సవాల్!

(రచయిత: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ, ప్రాప్తిస్థానం : శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, మంగమూరు డొంక, ఒంగోలు-2, ఫోన్ : 08592-233271)

ఈనాడు దైవము, మహిమలు మొదలైనవన్నీ మూఢనమ్మకాలని, ఆధ్యాత్మికత ఒక మనోజాడ్యమని, ఇవేవీ నేటి వైజ్ఞానిక దృష్టికి నిలవజాలవనే వాదం ఉధృతంగా సాగుతోంది. మరొకవంక ఎందరో మేధావులు, విజ్ఞానవంతులూ ఆశ్రమాలను, గురువులనూ ఆశ్రయిస్తున్నారు. వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సుకు ఆధ్యాత్మికత ఎంతో ఆవశ్యకమని తలుస్తున్నారు. నేటి విద్యావంతులు ఈ రెండు దృక్పథాలకూ నడుమ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఆస్తికతవైపు మొగ్గుతున్న హృదయాలు విజ్ఞాన శాస్త్రపరమైన సమన్వయం దొరకక అల్లాడుతూంటే, వైజ్ఞానిక సంస్కారవంతులు విశ్వంలో భౌతికము, జడమూ అయిన రసాయినిక పదార్థానికి అతీతమైన చైతన్యమే లేకుంటే జీవితానికి లక్ష్యమూ, విలువా లేవాయని ఆందోళన చెందుతున్నారు. నిర్దుష్టంగాను, కూలంకషంగాను, వైజ్ఞానిక దృష్టికీ-ఆధ్యాత్మికతకూగల సమన్వయాన్నిచ్చే గ్రంథాలు, వ్యక్తులు కన్పించడంలేదు. వాటిద్వారా తప్ప కొంతైనా జీవితానికి వెలుగు దొరకదు.

ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు ఒక దశాబ్దం శ్రమించి ఏడు ఆధునిక వైజ్ఞానిక రంగాలకూ, వివిధ దేశాల ఆధ్యాత్మిక సాంప్రదాయాలకు చెందిన 73 ప్రామాణిక గ్రంథాలను కూలంకషంగా పరిశీలించి వ్రాసిన మహత్తర గ్రంథము “విజ్ఞాన వీచికలు”. ఇటువంటి గ్రంధాన్ని పరిశీలించకుండా అస్తి-నాస్తి అనే విషయంలో అభిప్రాయాన్ని ఏర్పరచుకోడంగాని, సమాజానికి బోధించ యత్నించడంగాని మౌఢ్యము, ఆత్మవంచన అవుతుందనడం అతిశయోక్తి కాదని చదువరులకు ఏ పుట తెరచినా స్పష్టమవుతుంది.

నేటి సమాజంలో ఎట్టి అన్వేషణ చేయకుండానే ఆస్తికతనో, నాస్తికతనో గుడ్డిగా ప్రచారం చేసుకొంటున్నవారి మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ ‘ఎందుకీ గ్రంథమ’న్న ముందుమాట ప్రారంభమై సాగిన చర్చ చేస్తేగాని అసలీ ‘అస్తి-నాస్తి’ అన్న చర్చ అనాదిగా ఎందుకు కొనసాగుతున్నదో అర్థంగాదు.

దైవము లేక పరమాత్మ అన్న పదాలకూ, యావద్విశ్వానికే ఆధారము, మౌలికము అయిన చైతన్యమని నిర్వచనమిచ్చి, అట్టి విశ్వచైతన్యమన్నదొకటున్నదా లేదా అన్న మౌలికమైన ప్రశ్నకు శారీరక, భౌతిక, రసాయనిక, గణిత, జీవ, మనస్తత్వ, మానవపరిణామ శాస్త్రాలవంటి ఏడు ఆధునిక వైజ్ఞానిక రంగాలలో నేటివరకూ లభించిన ఆధారాలతో వేదాంత, బౌద్ధ, తావో మత సూత్రాలను 13 వీచికలలో రచయిత ఎంతో నిశితంగాను, కూలంకషంగానూ పరిశీలించారు. ఈ విస్తృత పరిశీలనలో బోల్ట్‌మెన్, నీల్స్‌బోర్, ఐన్‌స్టీన్, డిబ్రోగ్లీ, హైసెన్‌బర్గ్, మెనోస్కీ వంటి మహాప్రతిభావంతుల సిద్ధాంతాలను; ఒపేరిన్, ఎబెల్‌సన్, జార్జి, బ్రింక్‌మాన్, యూంగ్, మిల్లర్‌వంటి ప్రఖ్యాత రసాయనిక, జీవ రసాయనిక శాస్త్రవేత్తలను; రిచర్డ్‌థాంసన్, వాట్సన్, మారిసన్ వంటి గణిత శాస్త్రవేత్తలను; హాల్డేన్, డిరైస్ వంటి జీవశాస్త్రజ్ఞులను, పెన్‌ఫీల్డ్, వెడ్డింగ్‌టన్, స్పెరీ, బర్క్, ఫ్రైస్, పాపర్ వంటి నాడీ శాస్త్రజ్ఞులను, స్కిన్నర్, పాల్కే, రిచర్డ్స్, కాకుల, సిన్నల్ వంటి వైద్య శాస్త్రజ్ఞులను; విలియం జేమ్స్, యూంగ్, మోరోలాంబ్రో సరీస్‌వంటి మనస్తత్వవేత్తలను; మార్షల్, జాస్ట్రో, టైలర్, జె.హెన్క్, బిల్లా, ఆల్‌పోర్ట్, పాల్ట్‌వంటి మానవ పరిణామ శాస్త్రజ్ఞులు మొదలైన మరెందరి సిద్ధాంతాలనో వివరించారు రచయిత. ఇంత జటిలమూ, సూక్ష్మమూ అయిన విజ్ఞాన శాస్త్రాల హృదయాన్ని యింత సరళమైన వాడుకభాషలో, సరళరీతిలో రచయిత అందించగల్గడం ఆశ్చర్యం. గత మూడు శతాబ్దాలలో అపారంగా పెరిగిపోయిన యింత విజ్ఞానాన్ని 237 పుటలలో ప్రతి చదువరుడికీ అందించిన యీ గ్రంథం అపూర్వమంటే అతిశయోక్తికాదని చదువరులకు తెలియగలదు. ఇంత విజ్ఞానాన్ని సమన్వయించి అన్ని కోణాలనుంచి ఆస్తికతను-పరలోకము, పునర్జన్మ, మహిమల ప్రస్తావనయే తేకుండా రచయిత నిరూపించటం విశేషం. ఇంతటి కృషికి సహకరించి సార్థకమనిపించుకొన్న టి.టి.డి వారికీ, రచయితకూ సర్వులమూ సదా ఋణపడేలా చేసిందీ గ్రంథం. ఎన్ని ఆధ్యాత్మిక సంస్థలు, ఎందరు స్వాములు పండితులున్నా వీరెవ్వరూ నేటి యువతకు తగురీతిన వైజ్ఞానికంగా ఆధారాలతో ఆధ్యాత్మికతను వివరించకపోవడం నేటి ధర్మ ప్రచారానికి తీరని లోటనిపిస్తుంది.

**– డా॥ ఆకొండి విశ్వనాథం**

మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు
స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# శ్రీ సాయి సచ్చరిత్ర

## అధ్యాయము - 48

**September** సంచిక తరువాయి

శ్రీ గణేశాయ నమ:, శ్రీ సరస్వత్యై నమ:, శ్రీ గురుభ్యోన్నమ:, శ్రీ కులదేవతాయై నమ:,
శ్రీ సీతారామ చంద్రాభ్యాం నమ:, శ్రీ సద్గురు సాయినాథాయ నమ:

అక్కల్కోట నివాసియైన సపత్నేకర్ అను ఒక వకీలు అనుభవాన్ని విన్నట్లయితే శ్రోతలకు ఆనందం కలుగుతుంది(51). అతడు న్యాయవాది పరీక్షకు రాత్రింబవళ్ళు కష్టపడి చదువుతున్నాడు. ఒక రోజు ఆతని సహపాఠి అయిన షేవడే ఇతనిని కలిసాడు. ఇద్దరూ పరీక్షకు సంబంధించిన విషయం గూర్చి చర్చించుకుంటున్నారు(52). ఇంతలో తోటి విద్యార్థులు గూడా వచ్చి వీరితో చేరారు. అందరూ కలిసి ఎవరెవరు ఎంతవరకూ చదివారో తెలుసుకునేందుకు ప్రశ్నలు వేసుకుంటున్నారు(53). ఎవరు సరిగా జవాబులు చెప్పారు, ఎవరు చెప్పలేకపోయారు, ఎవరు ఎంత బాగా చదివారు అని పరీక్షించుకో సాగారు(54). షేవడే సరిగా సమాధానాలు చెప్పలేకపోయాడు. అప్పుడు సాటి విద్యార్థులందరూ ఇతడు సరిగా చదువలేదు గనుక సరిగా సమాధానాలు చెప్పలేకపోయాడు. కనుక ఇతడెలా పరీక్ష ఉత్తీర్ణుడవుతాడు! అన్నారు(55). తోటి విద్యార్థులు అతనిని అలా పరిహసించినప్పటికీ తాను పూర్తిగా చదివినా చదవకపోయినా పరీక్ష పాసవుతానని షేవడేకు పూర్తిగా నమ్మకం వుంది(56). అప్పుడు అతడిలా అన్నాడు: "నేను సరిగా చదివినా చదవకపోయినా నన్ను ఉత్తీర్ణుడను చేయడానికి మా సాయిబాబా వున్నారు. నాకెందుకు దిగులు?"(57).

అతని మాటలు విన్న సపత్నేకర్‌కు చాలా ఆశ్చర్యం కలిగింది. షేవడేను ప్రక్కకు పిలిచి యిలా అడిగాడు: "ఈ సాయిబాబా ఎవరు? మీరు యింతగా విశ్వసిస్తున్న ఆయన ఎక్కడుంటారు ?" (58,59). అప్పుడు షేవడే శ్రీ సాయిబాబా గూర్చి ఆయన మహత్యాన్ని గూర్చి వివరించి చెప్పాడు(60). సుప్రసిద్ధమైన అహ్మద్ నగర్ జిల్లాలో శిరిడీ అనే గ్రామం వుంది. అక్కడ వున్న మశీదులో సాయిబాబా అను ఒక ఫకీరు వున్నారు. ఆయన చాలా గొప్ప మహాత్ముడు(61). ఈ ప్రపంచంలో ఎంతో మంది మహాత్ములు అక్కడక్కడా వుంటారు. ఎంతో పూర్వపుణ్యం వలన గాని వారిని దర్శించే భాగ్యం లభించదు(62). నాకు వారిపై సంపూర్ణ విశ్వాసమున్నది. వారు ఏది తలిస్తే అది జరుగుతుంది. ఏది పలికితే అది ఫలిస్తుంది. వారి మాటలు ఎన్నటికీ అసత్యం కావు(63). ఈ సంవత్సరం నేను ఎంత ప్రయత్నించినా ఉత్తీర్ణుడను కాను. కానీ వచ్చే సంవత్సరం నేను ప్రయత్నించక పోయినా పాసయి తీరుతాను. ఇది ముమ్మాటికీ నిజం(64). ఆయన(బాబా) నాకు వాగ్దానం చేసారు. వారి మాటలు తప్పక జరిగి తీరుతాయి. నాకు ఆయన మాటలయందు విశ్వాసమున్నది(65). నేను ఈ పరీక్షే కాదు, ఆ పై పరీక్ష గూడా తప్పక పాసవుతాను. ఇందులో ఆశ్చర్యపడవలసినదేమి లేదు"(66). షేవడే మాటలు సపత్నేకర్‌కు హాస్యాస్పదంగా తోచాయి. అతడు సంశయాత్మకుడు. అతనికి ఈ మాటలు ఎలా నచ్చుతాయి? తర్వాత అతడూ, షేవడే ఎవరి స్వస్థలాలకు వారు వెళ్ళి పోయారు. ఆ తర్వాత ఏమి జరిగిందో శ్రోతలారా వినండి(67). పరీక్షా ఫలితాలు వచ్చాక షేవడే మాటలు యదార్థమని ఋజువైంది. షేవడే రెండు పరీక్షలలోనూ ఉత్తీర్ణుడయ్యాడు. సపత్నేకర్‌కు

చాలా ఆశ్చర్యం కలిగింది(68).

పది సంవత్సరాలు గడిచిపోయాయి. సపత్నేకర్‌ను దురదృష్టం వరించింది. అతడు పూర్తిగా కష్టాలలో మునిగిపోయాడు. అతడు చాలా నిరాశ చెందాడు(69). అతని ఒక్కగానొక్క కుమారుడు సం॥1913లో డిప్తీరియా జబ్బుతో మరణించాడు. అప్పటినుండి అతనికి సంసారం పట్ల విరక్తి కలిగింది(70). అతడు మనశ్శాంతి కోసం పండరిపురము, గాణ్గాపురము మొ॥న ప్రదేశాలకు తీర్థయాత్రలు చేసాడు. ఎన్నో వేదాంత గ్రంథాలను చదివాడు. కానీ ఫలితం శూన్యం(71). ఆ విధంగా మరికొంత కాలం గడిచింది. తనకు ఎప్పటికైనా మనశ్శాంతి లభిస్తుందా! అని అతడు చింతిస్తున్న సమయంలో అతనికి షేవడే చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి(72). సాయి చరణాల పట్ల షేవడేకు గల భక్తి విశ్వాసాలు, బాబా గూర్చి అతడు చెప్పిన మాటలు తలచుకుని తాను గూడా సాయిబాబాను దర్శించాలని నిశ్చయించుకున్నాడు(73). సం॥1913లో అతడు తన తమ్ముడైన పండితరావును తీసుకుని శిరిడీ బయలుదేరాడు(74). అతనికి షేవడే గుర్తుకు రావడం ఒక నిమిత్త మాత్రమే! నిజానికి సాయియే అతనిని తమ చెంతకు రప్పించుకున్నారు. శ్రోతలారా! శ్రద్ధగా వినండి(75).

సపత్నేకర్ తన తమ్ముడైన పండితరావును వెంటబెట్టుకుని సాయి దర్శనానికి శిరిడీ వెళ్ళాడు(76). అక్కడకు చేరుకోగానే ఇద్దరూ సాయి దర్శనానికి వెళ్ళారు. దూరం నుండే సాయిని దర్శించుకున్నారు. బాబాను దర్శించిన క్షణంలోనే అతని మనస్సుకు శంతి లభించింది(77). తర్వాత వారిద్దరూ బాబా దగ్గరకు వెళ్ళి రెండు చేతులూ జోడించి బాబా ఎదుట నిలబడ్డారు(78). ఇద్దరూ వినయంగా బాబాకు సాష్టాంగ నమస్కారం చేసి నిర్మల భక్తితో కొబ్బరికాయను సమర్పించారు(79). సపత్నేకర్ సాయి చరణాల వద్ద కొబ్బరికాయ సమర్పించగానే బాబా అతనిని, "ఛో! ఇక్కడ నుంచి!" అని కసిరారు(80). బాబా మాటలకు సపత్నేకర్ ఎంతో బాధపడ్డాడు. బాబా ఎందుకలా కోపగించారో అతనికి అర్థం కాలేదు. బాబా సన్నిహితులైన వారి ద్వారా బాబా కోపగించుకోవడానికి గల కారణాన్ని తెలుసుకోవాలనుకున్నాడు(81). బాబా దర్శనం అతనికి ఆనందాన్నిచ్చినప్పటికీ ఆయన కోపగించుకోవడం వల్ల అతడు ఖిన్నుడై వెనుకకు జరిగి తలవంచుకుని కూర్చున్నాడు(82). అతని ఆలోచన ఒక్కటే! 'ఇప్పుడు ఎవరి వద్దకు వెళ్ళాలి? బాబా చర్యలోని అర్థాన్ని ఎవరిని అడిగి తెలుసుకోవాలి?'(83). అతని బాధను గమనించి ఒకరు బాలాశింపే పేరు చెప్పారు. సపత్నేకర్ బాలాశింపే ఎక్కడ వుంటాడో విచారించి అతనిని కలుసుకున్నాడు(84). అతనికి జరిగినదంతా చెప్పాడు "బాబా చాలా కోపంగా నన్ను తిట్టి తరిమేశారు. నువ్వు నా వెంట రావాలి. బాబా నాపై కోపగించుకోకుండా శాంతంగా వుండేటట్లు, ఆయన తమ కృపాదృష్టిని నాపై ప్రసరింపజేసేటట్లు నువ్వే చూడాలి" అన్నాడు(85,86). అందుకు బాలాశింపే సమ్మతించాడు. బాలాశింపే ఒక బాబా పటాన్ని తీసికొచ్చాడు. అతనితో కలిసి సపత్నేకర్ బాబా దర్శనానికి వెళ్ళాడు(87). బాలాశింపే బాబా పటాన్ని బాబాకిచ్చి యిలా అన్నాడు : "దేవా ! ఈ చిత్రపటం ఎవరిది?"

అందుకు సమాధానంగా సపత్నేకర్‌ను చూపుతూ బాబా, "ఈ ఫోటో ఇతని ప్రియునిది!" అని నవ్వారు(88,89). అప్పుడు అక్కడవున్న భక్తులందరూ కూడా నవ్వారు. అప్పుడు బాలాశింపే బాబాను దాని అర్థమేమిటని అడిగాడు(90). బాబా ప్రసన్నులుగా వున్నారని, కనుక ఇదే తగిన సమయమనీ తలచి, త్వరగా నమస్కారం చేసుకోమని బాలాశింపే

సపత్నేకర్‌కు చెప్పాడు. సపత్నేకర్ నమస్కారం చేసుకోగానే మళ్ళీ బాబా అతనిని వెళ్ళిపొమ్మని కసిరారు(91). "మళ్ళీ బాబా నన్ను వెళ్ళిపొమ్మంటున్నారు. ఇప్పుడిక నేనేమి చేయాలి? నాకేది దారి?" అని సపత్నేకర్ బాధపడ్డాడు(92). అన్నదమ్ములిద్దరూ ఖిన్నులై చేతులు జోడించి బాబా ఎదుట నిలబడ్డారు. "తక్షణమే ఇక్కడనుండి వెళ్ళిపోండి!" అని బాబా గట్టిగా ఆజ్ఞాపించారు(93). వారిద్దరూ ఎంతో వినయంతో బాబాతో యిలా అన్నారు. "శ్రీ సాయి సమర్థా! మీ ఆజ్ఞను ఉల్లంఘించటం ఎవరికీ సాధ్యం కాదు. అటువంటప్పుడు పామరులైన మేమెంతటివారము? మీ ఆజ్ఞను శిరసావహించి మేమిప్పుడే వెళ్ళిపోతాము(94). మీరు గొప్ప ఉదారులని తలచి మీ దర్శనానికి వచ్చాము. కానీ వెళ్ళిపొమ్మన్న మీ తిరస్కారపూరిత మాటలతో మాకు సత్కారం లభించింది. ఈ మీ చమత్కారమేమిటో మాకు అర్థం కావడం లేదు(95). బాబా! మాపై మీ కృపాదృష్టిని ప్రసరింపజేయండి. త్వరలో మీ దర్శనం లభించేలా ఆశీర్వదించండి " అని బాబాను వేడుకున్నారు(96). కానీ బాబా చర్యలలోని ఆంతర్యాన్ని గ్రహించగలవారెవరు? సపత్నేకర్ బాబా ఆజ్ఞను శిరసావహించి స్వస్థలానికి వెళ్ళిపోయాడు(97). ఈ విధంగా సపత్నేకర్‌కు బాబా యొక్క ప్రధమ దర్శనం లభించింది. అతడు ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎంతో బాధ, నిరాశలతో తమ గ్రామానికి వెళ్ళిపోయాడు(98). తర్వాత మరొక సంవత్సరం గడిచింది. కానీ సపత్నేకర్ మనస్సు స్థిమిత పడలేదు. అతడు మళ్ళీ గాణ్గాపురం యాత్ర చేసాడు. కానీ శాంతి లభించలేదు(99). విశ్రాంతి కోసం అతడు మాడేగావ్ వెళ్ళాడు. చివరకు కాశీక్షేత్రానికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు(100).

- సశేషం

# నేను ఎక్కడికీ పోలేదు! ఇక్కడే ఉన్నాను!

అత్యంత ప్రీతి పాత్రులు, ఆరాధ్యదైవమూ ఆయిన పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులు, ఆకస్మికంగా సమాధి అవడంతో మా కుటుంబం తట్టుకోలేక పోయినాము. మా వారు, పిల్లలు ఆఫీసు, కాలేజి, స్కూళ్ళకు వెళితే ఒంటరిగా యింట్లో చాలా బాధ పడుతుండేదాన్ని. ఏ పనీ చేయ బుద్ధి కాక, దేని మీదా ధ్యాస వుండక చాలా ఆరాటంగా, ఆవేదనగా అనిపించేది. పూజ్యశ్రీ మాస్టరు గారు సమాధి చెందిన 17వ రోజు రాత్రి ఏడ్చి–ఏడ్చి దిండంతా తడిసిపోయింది. నిద్ర పట్టే సూచన అసలే లేదు. ఇంతలో ఒక అద్భుతం జరిగింది. ఉన్నట్లుండి ఆ గదిలో తడి ఆరని సిమెంటుతో కట్టిన సమాధి; ఆ సమాధి నుండి పుజ్యశ్రీ ఆచార్య గురుదేవులు బయటకి వచ్చారు! పాలనురుగులా, వెన్నెలలా స్వచ్ఛంగా తెల్లగా వున్న వారి బట్టలూ పచ్చటి శరీరంతో, ఎంతో ప్రకాశంతో – దివ్య కాంతులతో, వారు భౌతిక రూపంలో దర్శనమిచ్చారు. నేను విస్మయంతో, ఆనందంతో చూస్తుండిపోయాను అంతలోనే రెండు చేతులు బార చాపి " నేను ఎక్కడికీ పోలేదు! నేను ఎక్కడికీ పోలేదు! ఇక్కడే ఉన్నాను! ఇక్కడే ఉన్నాను!" అని ముమ్మారు పలికి అంతర్ధానమయినారు. మెలకువగా ఉన్న సమయంలో యీ దృశ్యం చూసిన నేను ఆశ్చర్యానందాలతో వారు దర్శనమిచ్చిన వైపే చూస్తుండిపోయాను.

దు:ఖించ వద్దు. నేను ఎప్పటికీ ఉన్నాను. ఉంటాను అని భౌతికంగా దర్శనమిచ్చి తెలియజేసారు. పిలిస్తే పలికే దైవం మన వెంటనే ఉన్నారు అని ఊరట చెందాను.

– కమలా రామచందర్.

# అగరొత్తులు అర్పించడంలో అంతరార్థం?

సువాసన నిచ్చేవి అగరువత్తులు, సాంబ్రాణి. సువాసన అంటే మన జ్ఞానేంద్రియమైన ముక్కుకే కాదు. పూర్వకర్మల ఫలితంగా వచ్చే సంస్కారాలు, వాసనలు. అవి మంచివి అయితే మరు జన్మలలో సద్బుద్ధి కలిగి భగవదైక్యానికి దారితీస్తుంది. వాటిని సంపాదించటం సాధకుల ప్రథమ యత్నం. సాధన పరిపూర్ణత చెందక జన్మ అయిపోయిన యెడల మరుజన్మలో తదవసరమైన సంకల్పాలు కలుగుతాయి. చేసే కృషికి ప్రతిరూపం ధూపం, సువాసనలు సరియైన కృషితో (సాధనతో) ఈ జన్మలోనే మనలోని భగవద్భక్తిని తారాస్థాయికి తీసుకుపోగలవు. అంత తీవ్రత గల వాసనలను సంపాదించాలి. దుర్గంధాల్ని రూపుమాపాలంటే అంతకంటె ఎన్నోరెట్లు బలమయిన సువాసనను కలిగించాలి. అగరువత్తుల ధూపం అర్పించటంలోని అంతరార్థం అదే.

అన్నింటికంటె మంచి సంస్కారాలనిచ్చేది భగవంతుడియందు మనస్సు (ధ్యాస) నిలుపడం. అది నామజపంవల్ల కావచ్చు, మంత్రజపంవల్ల కావచ్చు. వీటిలో దేన్ని అవలంబించినా మొదట దానినుంచి మనస్సు తొలగడం జరుగుతుంది. దాన్ని తిరిగి తిరిగి అనుసంధించడమే మార్గమని గీతకూడా చెబుతుంది. పున: పున: అనుసంధించడం కోసమే నామం, మంత్రం అనేకసార్లు పఠించడం, దీనికి చిహ్నమే అగరువత్తి, సాంబ్రాణి, వాటిని వెలిగించేది అగ్ని.

అగ్నిహోత్రంతో అగరువత్తి వెలిగిస్తాం. అంటే భగవంతుడి కటాక్షం వల్లనే సాధన చేద్దామనే సత్సంకల్పం మొదట కలిగేదని అర్థం. ఆ తర్వాత అగరువత్తి కాలుతూ, బూడిదగా మారుతూ సువాసన వెదజల్లుతుంది. అంటే సాధన (నామ, మంత్ర జపాలుగాని, ధ్యానంగానీ, అగ్ని స్వరూపమై భగవంతుడికి సూక్ష్మరూపం అయి సువాసనల్ని వెదజల్లుతూ, సాధకుణ్ణి సర్వ వాసనా రహితమూ (సంస్కార రహితము) జ్ఞాన–భక్తి–వైరాగ్య స్వరూపమూ అయిన ఊదీగా మార్చుతుంది. క్రమంగా అగరువత్తి అంతా ఊదీ అయిపోతుంది. ఇదే తపస్సన్నా, సాధన సిద్ధించటమన్నా, ఆ అగరువత్తిని సాధకుడు తనకు ప్రతిరూపంగా గ్రహిస్తాడు. తన సాధన వాసనాసంకల్పరహితుడవడం. అదొక్కటే కాదు. అన్నింటికంటే గొప్ప సంకల్పం జగత్ కళ్యాణం. అందుకని తన సిద్ధితో పాటు, అటువంటి సిద్ధి సర్వ జీవకోటికీ కలిగేందుకవసరమైన వాసనలను ఈ లోకమునందు వ్యాపింప చేయటం దానికి చిహ్నం. అందుకే ఎవడు సిద్ధిపొందినా, వారి నామం జపించి, వారిని పూజించే భక్తకోటి ఏర్పడుతుంది. అదే సువాసన వ్యాపించడం అంటే. రమణ నామం–రమణ భక్తులు; బాబా నామం–బాబా భక్తులూ స్మరించినట్లు. అగరొత్తి మొదలంటా క్రమేపీ కాలటం–నిరంతరారాధనకి సంకేతం.

## Annadaanam list :-

| | | |
|---|---|---|
| 1. Sri T.Rajeswari | Hyderabad | Rs 7000=00\- |
| 2. Sri K.Gopi | Hyderabad | Rs 5,116=00\- |
| 3. Sri M. Shantharam | Bangalore | Rs 1343=00\- |
| 4. Sri Anand Jadala | U.S.A. | Rs 1343=00\- |
| 5. Sri P.Indiravathi | Ananthapur | Rs 1350=00\- |
| 6. Sri T.Suresh babu | vijaywada | Rs 1343=00\- |
| 7. Sri D.V. Rohini kumar | Hyderabad | Rs 1350=00\- |
| 8. Sri Y.V. Rama Sastry | Tenali | Rs 1350=00\- |
| 9. Sri M. Lalithamma | Sompeta | Rs 1343=00\- |
| 10.Sri G. Ramanujulu | Madanapalli | Rs 1343=00\- |

School list:-

| | | |
|---|---|---|
| 1. Sri G. Brahmaiah | Chirala | Rs 500=00\- |
| 2. Sri G. Brahmaiah | Chirala | Rs 500=00\- |

# నీటమునిగిన రాఘవేంద్రులు

- ద్వారకానాథ్

ఇటీవలి వరదల దుర్ఘటనలో ఎందరెందరి జీవితాలో నీటపాలయ్యాయి. వేలకొలది కోట్ల నష్టంవొచ్చింది.(జీవితంలో ఆర్ధికం ముఖ్యమైపోయింది కదా... అందుకే కోట్ల రూపాయల విషయం ముందు). అపార జీవనష్టం(మనుషులే కాదండోయ్! జంతువులు. పక్షులు, క్రిమికీటకాలు, వృక్షాలు వగైరా) జరిగింది. (జీవానికి విలువ తగ్గిందిగా ఈ రోజులలో... అందుకే డబ్బు తర్వాతే ఆ ప్రస్తావన). ఎంతో మంది ఇళ్ళు, కుటుంబాలు కొట్టుకుపోయాయి. (ఆకలి చావులకంటే పర్యావరణం... జనాలకంటే తోటల (lawns) సంరక్షణకు ఎక్కువ ప్రాధాన్యత కదా ఈ రోజులలో.. అందుకే మనుషులు కూడా "పర్యావరణం" తర్వాతే. పొలాల తర్వాతే. కుటుంబ వ్యవస్థ 'వ్యక్తి' కన్నా, స్వార్ధం కన్నా తక్కువ విలువైనదిగా తయారైంది. అందుకే అది తరువాత.) ఇకపోతే రవాణా, విద్య, ఆరోగ్య రంగాలు, సేవలూ దెబ్బతిన్నాయి.(ప్రస్తావన వరుసను ఇంకా వివరించాలా?)

ఈ దుర్ఘటనలోనే మంత్రాలయ మహాక్షేత్రం, 'మన' రాఘవేంద్రస్వామి వారి మఠం కూడా నీట మునిగింది. (ఆధ్యాత్మికత అన్నిటికంటే చివరి ప్రాధాన్యత కదా!) అంతా ఇంత అల్లకల్లోలంగా ఉంటే చూస్తూకూడా, సానుభూతి నటిస్తూనే,ఒక అమాయక నిర్హేతువాది అడిగాడు. (హేతువు భగవంతుడు కాదనడం నిర్హేతుకం కదా....) "అయ్యా! రాఘవేంద్రుడు అంత మహిమ కలవాడంటివే ! మరి ఆయన మఠాన్నైనా కపాడుకోలేకపోయాడా?" "ఆయన గొప్పవాడు, మహిమకలవాడు కాదని అంటే వరదలు ఆగిపోతాయ్!" అన్నంత సీను ఉంది వాడి బొంగురు గొంతులో.

ఒకసారి ఒక వ్యక్తి ఆచార్యులతో "సార్! ప్రపంచం అస్సలు బాలేదు సార్!" అన్నాడట. వెంటనే మాస్టర్‌గారు "అవునోయ్! నువ్వు నేను వుంటాం కదా!" అన్నారట.

అలా, రాఘవేంద్రుడు, ఆయన మఠం నీటమునిగింది ఈ నాడు కాదు ఎందరో మహనీయులు అవతరించి ఆధ్యాత్మిక జీవితాన్ని నిర్దుష్టంచేసి, ఆచరించి నిరూపించి చూపిన భరత వర్షంలో, మహామహిమోపేతుడైన శ్రీ గురు రాఘవేంద్ర స్వామి కూడా అవతరించటం, సరైన మార్గం చూపటం జరిగింది. చారిత్రాత్మకంగా రాముడు, కృష్ణుడు గురించి ఆధారాలు లేకపోయిన, శ్రీ రాఘవేంద్రులు జీవితం, వారి బోధలు ఇంకా అందుబాటులోనే ఉన్న సమయం ఇది. ఆయన ఎక్కడ జన్మించి, ఎలా ప్రవర్తించి, ఎంతటి ఆధ్యాత్మికోన్నతిని కనబరచారో, అన్నీ చారిత్రాత్మక 'సత్యాలు'గా ఇంకా నిలిచే ఉన్నాయి. మానవ జాతి ఉద్భవించిన కాలాన్ని ఒక సంవత్సరంతో పోలిస్తే, రాఘవేంద్రులు ఆవిర్భవించి కొన్ని నిమిషాలు కూడా గడిచుండదు. అయినా ఆయన గురించి, ఆయన బోధలగురించి మన ఆంధ్రజాతి మరిచిపోయి చాలా కాలం అయ్యింది. 'గుండానంద' , 'బండానంద' మొదలైన 'కొత్త గురువుల' అగత్యం జాతికి పట్టనవసరంలేనంతగా, భక్తి, వైరాగ్యం మొదలైన అంశాల ఆచరణపూర్వకమైన రాఘవేంద్రస్వామి దివ్య బోధను మన మానససరోవరంలో, 'కలి' ఆలోచన వరద నీటిలో ఎప్పుడో మనజాతి ముంచేసింది. ఏ కొద్దిమందో వారిని పూజిస్తున్నారు. వారిని జ్ఞాపకం ఉంచుకుంటున్నారు.

తక్కిన వాళ్ళమందరం ఆయనకు మన 'రోజువారీ మురికి జీవితపు' అలవాటు జలాల మాటున కప్పివేసినప్పటినుండి, నిజంగా ఎంతో నష్టం జరిగింది. ఇవాళ మునిగింది ఆ వూరిలోని ఒక కట్టడం. ఆ పుణ్యక్షేత్ర పవిత్రత మన మనస్సుల్లో ఎప్పుడో జలసమాధి ఆయిపోయింది. అందుకే మన నిర్హేతువాదికి అంతటి ప్రశ్న వేసే అవకాశం వొచ్చింది.

ఇంతలో మనలను ఈ మానసిక బురదవరదల నుంచి కాపాడే దివ్యత్వం మన మధ్యకొచ్చింది. ఆధ్యాత్మికత ప్రకాశాల శంఖారావంగా, మన హృదయాలను, మానససరోవరాలను పవిత్రం చేసే తరుణం వొస్తోందనటానికి ఆశాకిరణం అగుపించింది. అదే ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజుల అవతరణ.

ఆధ్యాత్మికత అంటే నిజంగా ఏమిటో, మహాత్ములంటే నిజంగా ఎలాఉంటారో, వారి బోధలేమిటో, మనకు ఆచరణ యోగ్యమేమిటో తెలిపి, మహాత్ముల, వారి బోధల పాశస్త్యం అర్ధమయ్యేలా తెలిపిన పరమాచార్యులు మన గురుదేవులు. వీరి రచనల, బోధల ఆధారంగా మళ్ళీ మన జాతికి ఆధ్యాత్మిక శుభోదయం కలిగింది. శ్రీ శిరిడీ సాయి భక్త శ్రవంతి అనే క్రొత్తనీరు సర్వాన్నీ పరిప్లావితం చేస్తూ తోసుకొస్తోంది! "సాయినాధ ప్రభోధామృతం" ప్రభంజనంగా ప్రవహిస్తోంది! అది మన మనస్సులను సోకితే చాలు, ఆ మానససరోవరానికి పట్టిన బురదవరదనీరు కొట్టుకుని పోయి, ప్రశాంతము, శుభ్రము, పవిత్రము అయిన జలాలతో శోభిస్తాయి మన మనస్సులు.

'కుళ్ళు- కుతంత్రం', 'అసూయా-ద్వేషాలు', మొదలైన కుళ్ళుకంపు మన మనస్సులను వొదులుతుంది.

మన జాతి గతంలో జలసమాధి చేసిన మహనీయులు మహిమాన్విత మూర్తులు మనస్సులలో పున:ప్రతిష్ఠింపబడతారు. అప్పుడు దత్తకథలనే పిల్లవాయువుల తాకిడికి స్వచ్ఛమైన ఆలోచనలనే తరంగాలు ఉద్భవిస్తాయి. ఆ మానససరోవర మధ్యమున ప్రతిష్ఠితమైన రాఘవేంద్రులవంటి మహనీయ మూర్తుల పాదాలను తమ తలలతో స్పృశిస్తూ. నిత్య పవిత్రములై, ఆ తరంగాలు వారి పదచరణ సేవలో నిమగ్నమవుతాయి. ప్రతి ఆలోచన వారి పాదాలను సోకుతుంది. ప్రతి కార్యము వారిని అర్చిస్తుంది. ప్రతి మాట వారిని కీర్తిస్తుంది. అప్పటికి నిజానికి మనందరికీ, మానవజాతి మొత్తానికీ ప్రాణికోటి మొత్తానికీ ఇట్టి మానసిక బురదవరదల విధ్వంసం ముగుస్తుంది. సరైన మానవతా విలువలనే కమలాలు ఆ సరోవరాలలో నిలుస్తాయి. ధర్మాచరణమనే సుగంధాలు నలు దిశలా వ్యాపిస్తాయి. అప్పుడు జగమంతా మంత్రపూరితమవుతుంది. మంత్రాలయం అవుతుంది. అది రాఘవేంద్రుల విశ్వరూపమవుతుంది.

మానవ జాతిని, ధర్మాన్ని పునరుజ్జీవనం చేసే సాయి ప్రబోధామృత ధారలకు స్వాగతం పలుకుదాం. ప్రతిరోజూ కొంతైనా మన మనస్సులలోనికి ప్రవహించనిద్దాం. జీవితాలను సార్ధకం చేసుకుందాం. అప్పుడే మహితాత్ములు, కారుణ్యమూర్తులుఅయిన ఆ మహనీయులకు మనం నిజంగా అంజలి ఘటించినట్లు . వారు నిజంగా గొప్పవారని అంగీకరించినట్లు. అలా అంగీకారం అయితే ఆ అంగీకారం నిలిస్తే ఇక ఈ మానసిక బురదవరదలు ఎప్పటికీ మన మనస్సులకు రావు.

*జై సాయి మాస్టర్ !*

*నమో గురురాఘవేంద్రాయ !!*

---


**పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీగురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 40-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 10-00 |
| విజ్ఞాన వీచికలు | 40-00 |
| పరిప్రశ్న | 35-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 20-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 33-00 |
| బుద్ధధ్యాన హృదయం | 20-00 |

| | |
|---|---|
| దత్తావతార మహాత్మ్యం | 30-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 35-00 |
| పురుషసూక్త రహస్యం | 20-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 30-00 |
| అవధూ త శ్రీ చీరాల స్వామి | 15-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 20-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 40-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 25-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 30-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 35-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 30-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 22-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |
| గురుశుశ్రూష | 199-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 50-00 |
| Supreme Master (Swami Samartha) | 50-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 25-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |